ప్రజాశక్తి

సోమవారం 9 జూన్ 2025 8 పేజీలు

ప్రకాశం

బాపట్ల

ఎస్‌జిటిలకు

మాన్యువల్ కౌన్సిలింగ్ చేపట్టాల్సిందే..

(మొదటిపేజీ తరువాయి)

అధ్యక్షులు షేక్ అబ్దుల్ హై, ఎపిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు వాకా జనార్ధన రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయ సంఘాల నేతలు మాట్లాడారు. యుటిఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు కొమ్మోజు శ్రీనివాసరావు మాట్లాడుతూ బదిలీల విషయంలో విద్యా శాఖామంత్రి, కార్యదర్శి రాష్ట్ర స్థాయి ఉపాధ్యాయ సంఘాలకు ఇచ్చిన హామీ మేరకు ఎస్‌జిటి, పిఇటి, పండిట్స్‌కు మాన్యువల్ కౌన్సిలింగ్ జరపాలని డిమాండ్ చేశారు. ఇచ్చిన హామీ నిలబెట్టుకోలేని అసమర్ధత విద్యాశాఖ మంత్రి తక్షణం రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. మాన్యువల్ కౌన్సిలింగ్ వీలు కాదని, టెక్నాలజీ అందుబాటులో ఉంది వెబ్ కౌన్సిలింగ్ జరపాలని విద్యాశాఖ మభ్య పెట్టే ప్రయత్నాలను ఉపసంహరించుకోవాలని ప్రభుత్వానికి హితవు పలికారు. ఆన్‌లైన్ ప్రక్రియ ద్వారా నిర్వహించిన హెడ్‌మాస్టర్లు, స్కూల్ అసిస్టెంట్ బదిలీలలో గందరగోళం నెలకొందన్నారు. వందల్లో ఉన్న ఉపాధ్యాయుల సీనియారిటీ జాబితానే అనేక సార్లు సరిచేసిన అంశాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. జిల్లాలో సుమారు 3 వేల మంది ఉపాధ్యాయులు 3 వేల ఆప్షన్‌లు పెట్టుకోవడానికి టెక్నాలజీ అందుబాటులో ఉందా? అటువంటి సాఫ్ట్ వేర్ ప్రభుత్వం రూపొందించిందా? అని ప్రశ్నించారు. మాన్యూవల్ కౌన్సిలింగ్ జరపాలని రాష్ట్ర కార్యదర్శి మొదలు, ఆర్‌జెడిలను నాయకత్వం సంప్రదింపులు చేస్తుంటే అధికారులచే, ఎంఇల ద్వారా ఉపాధ్యాయులపై వెబ్ ఆప్షన్ పెట్టుకోవాలని ఒత్తిడి తెస్తున్నారని విమర్శించారు. ఎన్ని ఒత్తిడులు చేసినా రాష్ట్రవ్యాప్తంగా 15 వేల మందికి గానూ కేవలం 177 మందితో మాత్రమే ఆప్షన్స్ పెట్టించగలిగారని, ఇది ఉపాధ్యాయ ఉద్యమానికి నిదర్శనం అన్నారు. ఉపాధ్యాయులపై ఒత్తిడి తెస్తే సహించేది లేదని, ప్రభుత్వ ఉండేది కేవలం నాలుగేళ్లు మాత్రమేనని, తాము 30 ఏళ్ల వరకు సర్వీస్‌లో ఉంటామని, తాము తలుచుకుంటే ప్రభుత్వాలను మార్చగల శక్తి తమకుందని హెచ్చరించారు.

ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షురాలు చెన్నుపాటి మంజుల మాట్లాడుతూ ఉపాధ్యాయులను రాష్ట్ర ప్రభుత్వం చులకనగా చూస్తోందని విమర్శించారు. ఓఎస్‌డి నేరుగా ఉపాధ్యాయుల నాయకులకు ఫోన్లు చేసి మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారని, రాష్ట్ర ప్రభుత్వం బుల్డోజర్ పాలన కొనసాగిస్తోందని ఆరోపించారు.

అపాస్ రాష్ట్ర నాయకులు సిహెచ్ శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ విద్యాబుద్ధులు నేర్పించే ఉపాధ్యాయులను రోడ్డుపాలు చేయటం రాష్ట్ర ప్రభుత్వానికి తగదని హితవు పలికారు. మాన్యువల్ బదిలీ ప్రక్రియ ప్రభుత్వానికి పెద్ద సమస్య కాదని, ప్రభుత్వం తక్షణం దిగి రావాలని డిమాండ్ చేశారు. ఎస్టియు రాష్ట్ర నాయకులు చల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ బదిలీల చట్టానికి తూట్లు పొడవడం అత్యంత దుర్మార్గమని విమర్శించారు. ఏపిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు కే వి జి కీర్తి మాట్లాడుతూ బదిలీల చట్టాన్ని రాష్ట్ర ప్రభుత్వం తమకు అనుకూలంగా, ఉపాధ్యాయులకు భారంగా మార్చిందని దుయ్యబట్టారు. అనంతరం ఉపాధ్యాయులంతా డీఈవో కార్యాలయానికి వెళ్లే ప్రయత్నాన్ని సీఐ కె.శ్రీనివాసరావు, ఎస్ఐ ఏవీ.సుబ్బారావు పోలీస్ సిబ్బందితో అడ్డుకున్నారు. ఉపాధ్యాయులు కలెక్టరేట్ గేటును నెట్టేసి లోపలికి వచ్చే ప్రయత్నాన్ని పోలీసులు నిలువరించారు. డీఈఓను కలసి తమ సమస్యలను చర్చిస్తామని నాయకులు చేసిన విజ్ఞప్తిని పోలీస్ అధికారులు తోసిపుచ్చారు. నేతలు పట్టుబట్టడంతో డిఇఓ కిరణ్ కుమార్ కలెక్టరేట్ గేటు వద్దకు వచ్చి ఉపాధ్యాయ సంఘం నేతలతో మాట్లాడారు. డిమాండ్స్‌ను వినతి పత్రం ద్వారా అందించాలని డిఇఓ సూచించడంతో, ఆయన సూచన మేరకు ఉపాధ్యాయ సంఘాల నాయకులు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి డి వీరాంజనేయులు, ఎస్టియు జిల్లా అధ్యక్షులు కె ఎర్రయ్య, ఆపుస్ జిల్లా అధ్యక్షులు ఎం.మల్లికార్జునరావు, ఎపిటిఎఫ్ 1938. జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ లక్ష్మీనారాయణ, అధ్యక్షులు పివి.సుబ్బారావు, బిటిఎ రాష్ట్ర నాయకులు పర్రె వెంకట్రావు, మాధవరావు, యుటిఎఫ్ మహిళా అధ్యక్షురాలు జి ఉమామహేశ్వరి, పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు ఎ అమ్మయ్య.. ఇంకా పలు సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

'జగన్' వద్దకు..

మార్కాపుర అవిశ్వాసం 'పంచాయితీ'

ప్రజాశక్తి-మార్కాపురం

మార్కాపురం మున్సిపాలిటీలో ఇప్పటికీ వైసిపి అధికారంలో ఉంది. తగినంత కౌన్సిల్ బలం కలిగినా... ప్రస్తుతం అధికారం కోల్పోయే వరకు వచ్చింది. కారణాలు అనేకం ఉన్నా... కారకులు ఎవరనే విషయంపై వైసిపి అధిష్టానం ఆరా తీసినట్లు తెలిసింది. మార్కా'పుర' అవిశ్వాసం తీరూ తెన్నూ ఎలా జరిగిందనేది వైసిపి అధినేత, మాజీ సిఎం వైఎస్ జగన్ వరకు చేరినట్లు సమాచారం!

మార్కాపురం మున్సిపాలిటీ వైసిపి నుంచి టిడిపి వశం కావడం దాదాపు ఖాయమని తెలుస్తోంది. ఈపాటికే వైసిపి కౌన్సిలర్లు మెజార్టీగా తెలుగుదేశం వైపు వెళ్లారు. కొందరు వైసిపిలో ఉంటూ.. టిడిపికి మద్దతుగా నిలిచారు. ఈ నెల 11వ తేదీ ఉదయం 11 గంటలకు మున్సిపల్ చైర్మన్ చిర్లంచెర్ల బాలమురళీకృష్ణపై అవిశ్వాస సమావేశం జరగనుంది. ప్రలోభాలో... ఇంకేమైనా ఆశలు కల్పించారో తెలియదు కానీ.. అవిశ్వాసం నెగ్గేందుకు అవసరమైన 24 మంది కౌన్సిలర్ల బలాన్ని టిడిపి కూడగట్టుకుంది. ఐదుగురు సభ్యులున్న టిడిపి మున్సిపల్ పీఠం దక్కించుకోవడం కష్టతరమే. వైసిపి సభ్యుల సహకారంతో ఇదంతా జరుగుతోంది. మున్సిపాలిటీలో 35 స్థానాల్లో వైసిపి 30, టిడిపి 5 స్థానాల్లో విజయం సాధించిన విషయం తెలిసిందే. వైసిపికి చెందిన 23వ వార్డు కౌన్సిలర్

మున్సిపల్ కార్యాలయం

దూదేకుల ప్రసాద్ గతంలో మరణించారు. ప్రస్తుతం 29 మంది వైసిపి కౌన్సిలర్లు ఉన్నారు. వీరిలో 12 మంది అధికారికంగా టిడిపిలో చేరిపోయారు. మరో ఏడుగురు వైసిపి కౌన్సిలర్లు టిడిపి అవిశ్వాసానికి మద్దతుగా సంతకాలు చేశారు. దీంతో టిడిపి బలం 24కు చేరింది.

మార్కాపురం మున్సిపాలిటీలో చైర్మన్ చిర్లంచెర్ల బాలమురళీకృష్ణపై వ్యతిరేకత ఉన్నది వాస్తవమే. సగం కాలంలో చైర్మన్ పదవి వదులుకుని... వైసిపికి చెందిన 4వ వార్డు కౌన్సిలర్ డాక్టర్ చెప్పల్లి కనకదుర్గకు అవకాశం కల్పించాలని ఒప్పందం జరిగింది. చిర్లంచెర్ల మాత్రం ఒప్పందాన్ని తుంగలో తొక్కారు. అప్పట్లో ఒప్పందం కుదిర్చిన అప్పటి ఎమ్మెల్యే కుందురు నాగార్జునరెడ్డి చివరలో ఒప్పంద అమలులో కీలకంగా వ్యవహరించలేదనే ఆరోపణలు ఉన్నాయి. చిర్లంచెర్ల కొనసాగడంపై ఆసక్తి లేకపోయినా... డాక్టర్ చెప్పల్లి కనకదుర్గను మార్కా'పుర' పీఠం ఎక్కించేందుకు ఇష్టంలేకనే కాలయాపన చేసినట్లు వైసిపిలో చర్చ జరిగింది. ఇంతలో రాష్ట్రంలో టిడిపికి అధికారం దక్కింది. టిడిపితో లోపాయికారి ఒప్పందాలు జరిగినట్లు తెలిసింది. వైసిపిలో కీలకనేత వైసిపిలో కొనసాగుతున్న కౌన్సిలర్లను అధికార టిడిపిలోకి పంపారనేది బహిరంగ రహస్యమే!

మార్కాపురం మున్సిపాలిటీలో జరిగిన పరిణామాలపై వైసిపి కేంద్ర కార్యాలయం నివేదిక తెప్పించుకున్నట్లు తెలిసింది. అవిశ్వాసానికి బలం చేకూర్చిన అంశంపై అధిష్టానం సీరియస్‌గా ఉన్నట్లు తెలిసింది. గతంలో కౌన్సిల్ సమావేశాలకు వెళ్లకుండా కౌన్సిలర్లను కట్టడి చేసిన కీలక నేత... ఇప్పుడెందుకు టిడిపి వైపు వెళ్లకుండా ఆపలేకపోయారనే విషయం కూడా వైసిపిలో ప్రస్తావనకు వచ్చినట్లు తెలిసింది. ఈ నెల 11న పొదిలికి వైఎస్ జగన్ రానున్న నేపథ్యంలో... అదే రోజున మార్కాపురం మున్సిపల్ అవిశ్వాసం జరగనుంది. మార్కాపురంలో జరిగిన పరిణామాలపై జగన్ చర్చించే అవకాశం లేకపోలేదని వైసిపి శ్రేణులు పేర్కొంటున్నాయి.

ఎన్నికల హామీలను నెరవేర్చని కూటమి ప్రభుత్వం

ప్రజాశక్తి-కొనకనమిట్ల

వైసిపి విద్యుత్ ప్రభపై మాట్లాడుతున్న అన్నా రాంబాబు

ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం నెరవేర్చకుండా ప్రజలను మోసం చేస్తోందని మార్కాపురం వైసిపి ఇన్చార్జి, గిద్దలూరు మాజీ ఎమ్మెల్యే అన్న వెంకట రాంబాబు అన్నారు. శనివారం రాత్రి కొనకనమిట్లలో అంకాలమ్మ అమ్మవారి తిరునాళ్ల సందర్భంగా వైసీపీ ఆధ్వర్యంలో విద్యుత్ ప్రభపై ఆయన మాట్లాడారు ఇంటింటికీ బియ్యం పంపిణీ చేసే రేషన్ వాహనాలను రద్దు చేశారని, ఎన్నికల్లో ఇచ్చిన హామీలలో పింఛన్లు మినహా ఒక్కటి కూడా అమలు చేయలేదన్నారు. పొగాకు రైతులు గిట్టుబాటు ధరలు లేక రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని అన్నారు. ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకే మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఈ నెల 11న పొదిలి వస్తున్నారని, ఆ పర్యటనను విజయవంతం చేయాలని కోరారు. ఎంపీపీ మూరబోయిన మురళీకృష్ణ, వైసిపి మోరా శంకర్‌రెడ్డి, నాయకులు పునుగోటి కొండారెడ్డి, కళ్ళం దెబ్బరెడ్డి, పి లక్ష్మిరెడ్డి, పోలీరెడ్డి, వేంపాటి వెంకటేశ్వర్‌రెడ్డి, గర్రె శ్రీనివాసులు, పాలూరి లక్ష్మి వెంకటేశ్వర్లు, సిహెచ్ కోటేశ్వరరావు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం.. 10 కిలోమీటర్ల దూరం

(మొదటిపేజీ తరువాయి)

చాలు. అది తమ గూడేనికి తీసుకొచ్చి తాము రేషన్ తీసుకునేలా చేస్తే తమ బాధ తీరుతుందని చెన్నుపల్లి, పోతురాజుపెంట, బిల్లగొందిపెంట చెంచులు అభ్యర్థిస్తున్నారు. గత్యంతరం లేక పని మానుకొని రేషన్ సరుకుల కోసం ఆరు నుంచి పది కి.మీ దాకా నడిచివెళ్లి తెచ్చుకోవాల్సి వస్తోందని వాపోతున్నారు. ప్రభుత్వం స్పందించి తమ గూడేలకే రేషన్ సరుకులు తెచ్చి సరఫరా చేయాలని కోరుతున్నారు.

4 కి.మీ.లు వెళ్లి తెచ్చుకోవాల్సి వస్తోంది

కుడుముల గురవమ్మ, రేగులపల్లి

రేషన్ బియ్యం కోసం నాలుగు కి.మీ.లు నడవాల్సి వస్తోంది. మొగుళ్లపల్లి వెళ్లి తెచ్చుకోవాల్సి వస్తోంది. గతంలో బియ్యం బండి మా గూడేనికి వచ్చేది. ఇప్పుడు పని మానుకొని వెళ్లాల్సి వస్తోంది. మాకు చాలా ఇబ్బందిగా ఉంది.

రేషన్ బియ్యం కోసం తిప్పలు

పులిచర్ల యోగమ్మ, తెలుగురాయుని చెరువు

రేషన్ బియ్యం కావాలంటే ఈ నెల నుంచి తిప్పలు తప్పేలా లేదు. గంజివారిపల్లి వెళ్లి బియ్యం తెచ్చుకునేందుకు ఎనిమిది కి.మీ నడవాల్సి వస్తోంది. దీని కోసం ఒక రోజంతా పని మానుకోవాలి. గతంలో తమ ఇంటికే వచ్చి సరుకులు ఇచ్చేవారు.

గూడేనికి తెచ్చి బియ్యం పంపిణీ చేయాలి

కుడుముల అంకన్న, దద్దనాల

రేషన్ షాపుల వద్ద తాము పడిగాపులు కాయలేం. ఆరు కి.మీ.లు కాలిబాటన వెళ్లి తెచ్చుకోవడం కష్టంగా ఉంది. అధికారులు కనీసం ఒక ట్రాక్టర్‌లోనైనా రేషన్ బియ్యాన్ని తమ గూడేనికి తెచ్చి ఇచ్చే ఏర్పాటు చేయాలి. లేకుంటే తాము ప్రతినెలా ఇబ్బందులు పడాల్సి వస్తుంది.

ఎస్‌జిటిల కౌన్సిలింగ్ కోసం

నేడు ఉపాధ్యాయుల నిరాహార దీక్ష

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

ఎస్జీటీ సమాన కేడర్ ఉపాధ్యాయుల బదిలీలను మాన్యువల్‌గా చేపట్టాలని కోరుతూ ఉపాధ్యాయులు ఆందోళన ఉధతం చేయాలని ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక తీర్మానించింది. ఆదివారం సాయంత్రం యుటిఎఫ్ కార్యాలయంలో ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక అత్యవసర సమావేశం జరిగింది. సమావేశంలో కౌన్సిలింగ్‌ను మాన్యువల్‌గా చేపట్టాలని అన్ని ఉపాధ్యాయ సంఘాలు ఏకగ్రీవంగా తీర్మానించారు. రాష్ట్ర ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక కార్యాచరణ ప్రకటించింది. ఆందోళనలో భాగంగా 9వ తేదీ సోమవారం ఉదయం 10 గంటలకు అన్ని జిల్లాల డిఇఓ కార్యాలయం ఎదుట ఐక్యవేదిక ఆధ్వర్యంలో నిరాహార దీక్షలు చేపట్టాలని, పదో తేదీన మంగళవారం ఉదయం 10 గంటలకు రాష్ట్ర విద్యాభవన్ ముట్టడి నిర్వహించాలని నిర్ణయించాయి. అదేవిధంగా ఈ కార్యాచరణతో పాటు విద్యాశాఖమంత్రి నారా లోకేష్‌కు వాట్సప్, ఇమెయిల్ ద్వారా ఉపాధ్యాయ డిమాండ్లు తెలియజేయాలని తీర్మానించారు. 9న సోమవారం ఉదయం ప్రకాశ భవనం ఎదుట పది గంటలకు ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్నట్లు ప్రకాశం జిల్లా ఐక్యవేదిక తెలియజేసింది. కిందిస్థాయి ఉపాధ్యాయులు ఏ ఒక్కరూ వెబ్ ఆప్షన్ పెట్టవద్దని సూచనలు చేశారు. కౌన్సిలింగ్ అంశంపై, ఎస్ జిటిలకు అండగా ఉంటామని రాష్ట్ర ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక భరోసా ఇస్తుందని వారు పేర్కొన్నారు. సమావేశంలో యుటిఎఫ్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు కొమ్మోజు శ్రీనివాసరావు, యుటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు షేక్ అబ్దుల్ హై, ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు వాక జనార్దన్ రెడ్డి, బి శేషారావు, యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి డి వీరాంజనేయులు, ఏపీటీఎఫ్ 1938 నాయకులు పి వి సుబ్బారావు, ఆపస్ నాయకులు దిలీప్ చక్రవర్తి, ఏపీ టిఎఫ్ నాయకులు డి శ్రీనివాసులు, బిటిఎ నాయకులు దేవసహాయం, యుటిఎఫ్ గౌరవ అధ్యక్షులు ఎస్ రవి, కోశాధికారి చిన్నస్వామి తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు యోగా..

యోగా చేస్తున్న వృద్ధులు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకొని స్థానిక కలెక్టర్ కార్యాలయం వద్ద వృద్ధులకు యోగా కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు.

కార్యక్రమంలో దివ్యాంగులు, వృద్ధులు, సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు జి అర్చన, వయోవృద్ధుల వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు జె వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి సరికొండ అప్పలరాజు, కోశాధికారి పబ్బిశెట్టి శ్రీనివాసరావు, 50 మంది వృద్ధులు పాల్గొన్నారు.

PASSPORT LOST

Passport was lost on 02-06-2025, while traveling J.Panguluru to Reningavaram Village bearing number is **Y-8691640** issued on the name of **NAGARJUNA YANAMALA** S/O **SINGAIAH** ,residing at Reningavaram village, J.Panguluru (Mandal), Bapatla (District), A.P. If anyone find it, please inform at the following mobile number : **95501 55296**

ప్రజాశక్తి

సోమవారం 9 జూన్ 2025 | 8 పేజీలు

ప్రకాశం

బాపట్ల

నా వాళ్లను కాపాడుకుంటా..

మాజీ మంత్రి బాలినేని

మాట్లాడుతున్న బాలినేని

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

'నా వాళ్లను కాపాడుకుంటా..' అని జనసేన నాయకులు, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి అన్నారు. ఆదివారం ఆయన ఒంగోలుకు వచ్చారు. తొలుత జిల్లా ఎస్పీ దామోదర్ కుమార్తె, కుమారుడి నూతన వస్త్రాల వేడుక కార్యక్రమంలో పాల్గొన్నారు. చిన్నారులను ఆశీర్వదించారు. కొత్తపట్నం మండలంలోనూ ఓ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా మీడియా ప్రతినిధులు అడిగిన ప్రశ్నలకి బాలినేని సమాధానం చెబుతూ.. తమ పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటానన్నారు. తన వెంట ఉన్న వాళ్లని కాపాడుకుంటానని తెలిపారు. ఇకపై ఒంగోలులోనే ఎక్కువ ఉంటానన్నారు. చాలా రోజుల తర్వాత ఒంగోలు వచ్చిన బాలినేనికి పార్టీ నాయకులు, కార్పొరేటర్లు, కార్యకర్తలు కలిశారు.

చిన్నారులకు ఆశీర్వాదం

ప్రకాశం జిల్లా ఎస్పీ ఏఆర్.దామోదర్ కుమార్తె, కుమారుడి నూతన వస్త్రాల వేడుక ఒంగోలులోని ఎస్‌జివిఎస్ కన్వెన్షన్‌లో ఆదివారం వైభవంగా జరిగింది. మంత్రి స్వామి, ప్రకాశం, బాపట్ల కలెక్టర్లు తమీమ్‌అన్సారియా, వెంకటమురళి, ప్రజాప్రతినిధులు వేడుకకు హాజరై.. చిన్నారులను ఆశీర్వదించారు.
- ప్రజాశక్తి, ఒంగోలు కలెక్టరేట్

రేషన్ బియ్యం

10 కిలోమీటర్ల దూరం

- బియ్యం తెచ్చుకొనేందుకు అంత దూరం నడవాల్సిందే..
- అవస్థలు పడుతున్న చెంచులు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెం మండలంలోని నల్లమల అటవీ ప్రాంతాల్లో జీవించే చెంచు గిరిజనులు రేషన్ బియ్యం తెచ్చుకొనేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తాజాగా తీసుకున్న ప్రభుత్వం నిర్ణయంతో రేషన్ సరుకులు షాపుల వద్దకే వచ్చి.. చెంచులు తీసుకోవాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో చెంచులు రేషన్ సరుకుల కోసం ఆరు నుంచి పది కి.మీ దూరంలో ఉన్న గ్రామాలకు వెళ్లి రేషన్ సరుకులు తీసుకొని వాటిని నెత్తిన పెట్టుకొని రహదారి సక్రమంగా లేని తమ గూడేలకు కాలి బాటన వెళ్లాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ముఖ్యంగా మిల్లంపల్లి ఇలాకాలోని ప్రజలంతా రేషన్ సరుకుల కోసం మురారిపల్లి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. మిల్లంపల్లి నుంచి మురారిపల్లికి ఆరు కి.మీ దూరం ఉంది.

దట్టమైన అడవిలో..

దట్టమైన నల్లమల అడవిలోని గంజివారిపల్లిలో చెంచు గిరిజన స్టోర్ ఉంది. దాని పరిధిలో శాంతినగర్, గాంధీనగర్, దద్దనాల, అల్లిపాలెం, చెన్నుపల్లి వంటి గ్రామాల్లో 250 కార్డులు, వెంకటాద్రిపాలెం పరిధిలో సంగం తండా, పునరాస కాలనీల్లో 70 కార్డులు, వీరభద్రాపురం పరిధిలో 50 కార్డులు ఉన్నాయి. మొత్తం 300 చెంచు కుటుంబాలు ఒక్కొక్క కుటుంబానికి నెలకు 35 కిలోల బియ్యం వస్తోంది. కానీ ఈ బియ్యం అందుకునేందుకు వారు వెళ్లాల్సిన రేషన్ షాపులు కనీసం ఆరు నుంచి పది కిలోమీటర్ల దూరంలో ఉన్నాయి. అడవిలో నివసిస్తూ, వ్యవస్థల నుంచి ఇప్పటికే దూరంగా ఉంటున్న ఈ సమాజం ఇప్పుడు రేషన్ కోసం కూడా భారం మోసే స్థితిలో పడింది.

చిన్నారితో కలిసి నడిచి వెళ్లి బియ్యం తెచ్చుకుంటున్న మహిళ

రేషన్ కోసం పని మానుకోవాలి..

బియ్యం కోసం వెళ్దాం అంటే గంటల తరబడి నడవాల్సి వస్తోందని భూమని నాగన్న, అంకమ్మ, కుడుముల నాగమ్మ వాపోయారు. పొద్దున్న లేచి బిడ్డల్ని ఇంట్లో వదిలిపెట్టి ఎండలో రేషన్ షాపుల బాట పట్టాల్సి వస్తోందని చెబుతున్నారు. చెంచు గిరిజనులు అడిగింది పెద్ద ఖర్చేమీ కాదు. ఒక్కరోజు ఒక్క వాహనం అది ట్రాక్టర్ అయినా ▶ 2లో

ఎస్‌జిటిలకు

మాన్యువల్ కౌన్సిలింగ్ చేపట్టాల్సిందే..

- హామీ నిలబెట్టుకోలేని విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలి...
- ఉపాధ్యాయుల జోలికొస్తే గత ప్రభుత్వానికి పట్టిన గతే పడుతుంది..
- విద్యాశాఖ మొండి వైఖరి విడనాడాలి
- వెబ్ కౌన్సిలింగ్ ససేమిరా వద్దు..
- ఉపాధ్యాయ ఐక్య సంఘాల ఆధ్వర్యంలో ప్రకాశం భవనం ముట్టడి

ముట్టడిని ఉద్దేశించి మాట్లాడుతున్న యుటిఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు కొమ్మోజు శ్రీనివాసరావు

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

విద్యాశాఖ ఇచ్చిన హామీ మేరకు ఎస్జీటీలకు మాన్యువల్ కౌన్సిలింగ్ నిర్వహించాలని డిమాండ్ చేస్తూ ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఆదివారం నాడు కలెక్టరేట్‌ను ముట్టడించారు. మూడు దశాబ్దాలుగా ఎస్ జిటిలకు మాన్యువల్ పద్ధతిలో కౌన్సిలింగ్ నిర్వహిస్తుండగా రాష్ట్ర విద్యాశాఖ మంత్రి, విద్యాశాఖ కార్యదర్శి విద్యాహక్కు చట్టం పేరుతో వెబ్ కౌన్సిలింగ్ నిర్వహిస్తామని ప్రకటించటం ఏరు దాటినాక తెప్ప తగలేసిన తీరుగా ఉందని పలువురు నేతలు మండిపడ్డారు. పూటకొక ఉత్తర్వు, గంటకొక సవరణతో ఉపాధ్యాయులను ఆందోళనకు గురిచేస్తున్నట్లు విమర్శించారు. ఉపాధ్యాయుల బదిలీ చట్టం పేరుతో ప్రభుత్వం తమకు అనుకూలంగా మలచుకుంటూ డబుల్‌ఇంజన్ పాలన సాగిస్తున్నట్లు దుయ్యబట్టారు. ఉపాధ్యాయుల బదిలీల విషయంలో ఎస్‌జిటి, పిఇటి, పండిట్స్‌కు మాన్యువల్ ప్రక్రియ స్థానే వెబ్ కౌన్సిలింగ్ చేపట్టాలని విద్యాశాఖ ఆదేశాలను నిరసిస్తూ రాష్ట్రవ్యాప్తంగా ఉపాధ్యాయ సంఘాలు ఆందోళన చేపట్టాయి. ఉపాధ్యాయ సంఘాల ఐక్య వేదిక పిలుపు మేరకు ఆదివారం ఉదయం తొమ్మిది గంటలకే ఉమ్మడి ప్రకాశం జిల్లా నలుమూలల నుంచి సుమారు వెయ్యి మంది ఉపాధ్యాయులు ప్రకాశం భవనం చేరుకొని సెంటర్ గేట్ వద్ద మధ్యాహ్నం ఒంటి గంట వరకు బైఠాయించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ జిల్లా ▶ 2లో

ఉపాధ్యాయులను అడ్డుకుంటున్న పోలీసులు

వ్యవసాయ పరికరాలను ప్రారంభిస్తున్న మంత్రి స్వామి

వ్యవసాయంలో యాంత్రీకరణతో లాభాలు

మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి

▶ మెయిన్ 6లో

అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు

నేడు 'షైనింగ్ స్టార్స్' ప్రదానం

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

జిల్లాలో పదోతరగతి, ఇంటర్మీడియట్‌లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు షైనింగ్ స్టార్స్ అవార్డుల ప్రదానోత్సవం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ జె.వెంకటమురళి ఒక ప్రకటనలో తెలిపారు. షైనింగ్ స్టార్స్ అవార్డ్స్ కార్యక్రమం సోమవారం మధ్యాహ్నం 1:30 గంటలకు సాయిరాం గార్డెన్ కన్వెన్షన్ హాలులో జరుగుతుందన్నారు. కార్యక్రమానికి జిల్లాలోని ప్రజాప్రతినిధులు హాజరవుతారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లాలో పదోతరగతి, ఇంటర్మీడియట్‌లో అత్యధిక మార్కులు సాధించిన ప్రభుత్వ పాఠశాలలు, కళాశాల విద్యార్థులకు నగదు పారితోషికం, అవార్డుల ప్రదానోత్సవం చేస్తామన్నారు.

కలెక్టర్ జె.వెంకటమురళి

నేడు బాపట్లలో యోగాంధ్ర

యోగా ఆంధ్ర కార్యక్రమం బాపట్ల భావన్నారాయణ స్వామి దేవాలయం ముందు సోమవారం ఉదయం 6:30 నుండి 7:30 గంటల వరకు జరుగుతుందని కలెక్టర్ జె.వెంకటమురళి ఒక ప్రకటనలో తెలియజేశారు. అనంతరం భావనారాయణ స్వామి దేవాలయం నుండి అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ, మానవహారం నిర్మించడం జరుగుతుందన్నారు. యోగాంధ్ర కార్యక్రమానికి జిల్లా అధికారులు, సిబ్బంది, పుర ప్రజలు తప్పక హాజరుకావాలని కలెక్టర్ కోరారు.

నిరసన వ్యక్తం చేస్తున్న ఉపాధ్యాయ సంఘాలు

ఉపాధ్యాయుల నిరసన

ప్రజాశక్తి - భట్టిప్రోలు

ఉపాధ్యాయుల బాధలీల్లో నెలకొన్న సమస్యలు పరిష్కారం అయ్యేవరకు 9,10 తేదీల్లో కూడా వివిధ రూపాల్లో నిరసన కొనసాగిస్తున్నట్లు యుటిఎఫ్ మండల అధ్యక్షులు వి సురేష్ కుమార్ తెలిపారు. సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుల మ్యానువల్ కౌన్సిలింగ్ ఏర్పాటుకై విద్యా కమిషనర్‌తో ఉపాధ్యాయ ఐక్యవేదిక సంఘాల చర్చలు సఫలీకృతం కానందున తిరిగి 9న అన్ని జిల్లాల డీఈఓ కార్యాలయాల వద్ద నిరాహార దీక్షలు, 10న రాష్ట్ర విద్యా భవన్ ముట్టడికి ఐక్య సంఘాలు పిలుపు ఇచ్చినట్లు చెప్పారు. కార్యాచరణను అన్ని జిల్లా కేంద్రాల ఐక్యవేదిక బాధ్యులు చొరవచూపి అన్ని ఉపాధ్యాయ సంఘాలను కలుపుకొని విజయవంతం అయ్యేవిధంగా చూడాలని కోరారు.

1998-99 బివిఅండ్ బిఎన్ హై స్కూల్ పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక

ప్రజాశక్తి - చీరాల

పాఠశాల్లో చదువుకున్న జ్ఞాపకాలు గుర్తు చేసుకునేందుకే పూర్వ విద్యార్థుల కలయిక ఎంతో ఆనందంగా ఉందని పలువురు పూర్వ విద్యార్థుల పేర్కొన్నారు. మండలంలోని దేవాంగపురి బివి అండ్ బిఎన్ హై స్కూలులో 1998-99లో 10వ తరగతి చదివిన విద్యార్థులు 25ఏళ్ల తర్వాత కలుసుకోవడం అపూర్వం, అనిర్వచనీయం అన్నారు. గతకాలపు జ్ఞాపకాలు నెమరు వేసుకున్నారు. తమ జీవితాల్లో జరిగిన ఒడిదుడుకులను చెప్పుకుంటూ భవిష్యత్తుకు బంగారు బాట వేసుకుంటూ మాట్లాడుకున్న మాటలు ఎన్నటికీ మరిచిపోలేనివని, మరపురానివని అన్నారు. 130 మంది ఒకేసారి కలవటం సంతోషంగా ఉందని అన్నారు. ఈ సందర్భంగా అప్పట్లో పాఠాలు చెప్పి విద్యాబుద్ధులు నేర్పిన 35మంది ఉపాధ్యాయినీఈ, ఉపాధ్యాయులకు సన్మానం చేశారు. ఈ బ్యాచ్‌కు ప్రెసిడెంట్, కార్యదర్శులుగా బొడ్డు సుబ్రహ్మణ్యం, గుంటూరు బాలసుబ్రహ్మణ్యం వ్యవహరించారు. జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత గుత్తి హేరంభరావు, కెఎస్ఎస్ ప్రసాద్, బొడ్డు బాలచంద్రరావు, పన్నెం కోటయ్య బాబు తదిత ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. అనంతరం పూర్వ విద్యార్థులు పలు జ్ఞాపకాలు గుర్తు చేసుకొని ఫోటోలు దిగుతూ ఆనందాన్ని వ్యక్తం చేశారు.

బాధ్యతలు చేపడుతున్న డిటి శాంతలక్ష్మి

డిప్యూటీ తహశీల్దారుగా శాంతలక్ష్మి

ప్రజాశక్తి - భట్టిప్రోలు

నూతన డిటిగా అనగాని శాంత లక్ష్మి ఆదివారం బాధ్యతలు చేపట్టారు. ఆమె చెరుకుపల్లి తహశీల్దారు కార్యాలయంలో ఇప్పటివరకు డిటిగా పని చేస్తూ సాధారణ బదిలీల్లో భాగంగా భట్టిప్రోలు వచ్చారు. గత నాలుగేళ్లుగా డిప్యూటి తహశీల్దారు స్థానం ఖాళీగా ఉంది. ఇక్కడ డీటీగా పనిచేస్తున్న జి నాగరాజును కలెక్టర్ సీసీగా డిప్యూటేషన్‌పై కేటాయించడంతో ఇటీవల వరకు అక్కడే పనిచేసి పదోన్నతిపై తహశీల్దారుగా కారంచేడులో ఆయన బాధ్యతలు చేపట్టారు. ఈ మేరకు బాధ్యతలు చేపట్టిన డిటి శాంత లక్ష్మికి ఆర్ఐ ఫణి కుమార్, విఆర్ఒలు, కార్యాలయ సిబ్బంది స్వాగతం పలికారు.

కౌలు రైతు ఆత్మహత్యపై అధికారుల విచారణ

ప్రజాశక్తి - పంగులూరు

రైతు కుటుంబాన్ని పరామర్శిస్తున్న డిఎస్పి మొయిన్, ఆర్డిఓ చంద్రశేఖర్

వ్యవసాయంలో వచ్చిన అప్పులు భరించలేక ఆత్మహత్య చేసుకున్న కౌలు రైతు తలపనేని శ్రీనాథ్ కుటుంబాన్ని చీరాల డిఎస్పి మహమ్మద్ మోయిన్, చీరాల ఆర్డీఓ చంద్రశేఖర్ నాయుడు ఆదివారం విచారించారు. కౌలు రైతు తలపనేని శ్రీనాథ్ అప్పుల బాధ భరించలేక గత నెల 24న పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్న విషయం పాఠకులకు తెలిసిందే. శ్రీనాథ్ స్వగ్రామమైన మండలంలోని జనకవరం గ్రామానికి చేరుకున్న డిఎస్‌పి, ఆర్‌డిఒలు శ్రీనాథ్ కుటుంబ సభ్యులను కలిసి వివరాలు తెలుసుకున్నారు. శ్రీనాథ్ మృతికి గల కారణాలను స్థానికులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎఒ డి సుబ్బారెడ్డి మాట్లాడుతూ శ్రీనాథ్ అప్పుల గురించి ఆర్డిఒ ,డిఎస్పికి వివరించారు. శ్రీనాథ్ గతేడాది తొమ్మిదిన్నర ఎకరాల భూమిని కౌలుకు తీసుకొని అందులో రెండు ఎకరాల 10 సెంట్లు పొగాకు, 2.5ఎకరాల్లో మిర్చి, 4.80 ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేసినట్లు తెలిపారు. పంటలు సరిగా పండక, దిగుబడి సరిగా రాక పోవటం వలన రూ.18,68,437 వరకు అప్పులు అయినట్లు తెలిపారు. వీటిలో ప్రైవేటు వ్యక్తుల దగ్గర తీసుకున్న అప్పు రూ.6.50లక్షలు కాగా, బ్యాంకుల నుండి రూ.12.18 లక్షలు తీసుకున్నట్లు తెలిపారు. డిఎస్పి మహమ్మద్ మొయిన్, ఆర్డీఒ చంద్రశేఖర్ నాయుడు మాట్లాడుతూ ప్రస్తుతం ఉంటున్న ఇల్లు సొంత ఇల్లు కాకపోవటం వలన ఎక్కడైనా గ్రామం సమీపంలో ప్రభుత్వ భూమి ఉంటే 3సెంట్లు స్థలం ఇచ్చి గృహ నిర్మాణ శాఖ ద్వారా ఇల్లు నిర్మించి ఇవ్వాలని తహశీల్దారు సింగారావును ఆదేశించారు. ఇద్దరు చిన్న పిల్లలు కావటంతో వారి చదువులు, కుటుంబ అవసరాలకు ప్రభుత్వం నుంచి సహాయం వచ్చే విధంగా ప్రభుత్వానికి నివేదిక తయారు చేసి పంపిస్తామని తెలిపారు. వీలైనంత త్వరలో కుటుంబానికి సహాయం అందే విధంగా చేస్తామని హామీ ఇచ్చారు. అంతకుముందు శ్రీనాథ్ తండ్రి హరిబాబు, భార్య వందనను వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో తహశీల్దారు పి సింగారావు, రేణింగవరం ఎస్ఐ వినోద్ బాబు, ఆర్ఐ శ్వేత, విఆర్ఒలు చింపారావు, పావని, జనకవరం గ్రామస్తులు పాల్గొన్నారు.

పని గంటల పెంపుపై కార్మికుల నిరసన

ప్రజాశక్తి - పర్చూరు

బొమ్మలు సెంటర్లో నిరసన తెలుపుతున్న సిఐటియు కార్మికులు

పనిగంటలు పెంచుతూ రాష్ట్ర మంత్రివర్గం తీసుకున్న నిర్ణయానికి వ్యతిరేకంగా స్థానిక బొమ్మలు సెంటర్లో సిఐటియు ఆధ్వర్యంలో ఆదివారం నిరసన తెలిపారు. పనిగంటల పెంపు విరమించుకుని 8గంటల పనివిధానం అమలు చేయాలని సిఐటియు నాయకులు కె శ్రీనివాసరావు కోరారు. ప్రభుత్వం 8 గంటల పని దినాన్ని 10 గంటల పనిదినంగా మారుస్తూ తీసుకొస్తున్న బిల్లు వెంటనే ఉపసంహరించుకోవాలని కోరారు. కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులను యజమానులకు అనుకూలంగా మార్చడం మానుకోవాలని హెచ్చరించారు. కార్మికులకు న్యాయం చేయని పక్షంలో ఐక్య పోరాటం సాగిస్తామని చెప్పారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు బి చినదాసు, ఎం డేవిడ్, పంచాయతీ కార్మికుడు నాగేశ్వరరావు, మార్కెట్ యార్డు కార్మికులు పోతరాజు, రిక్షా కార్మికులు పాల్గొన్నారు.

మెగా కంటి వైద్యశిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి - వేటపాలెం, చిన్నగంజాం

బిపి పరీక్ష చేస్తున్న వైద్యులు

ఏలూరి చారిటబుల్ ట్రస్ట్, గ్రీన్ స్పార్క్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శంకర్ కంటి ఆసుపత్రి సౌజన్యంతో చిన్న గంజాం జిల్లా పరిషత్ హై లులో ఆదివారం నిర్వహించిన ఉచిత మెగా కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఉదయం 7గంటల నుండి మధ్యాహ్నం 2గంటల వరకు వైద్య శిబిరం కొనసాగింది. ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఆదేశాల మేరకు మహిళలు, పురుషులకు వేరు వేరుగా ప్రత్యేక ఓపికౌంటర్లు ఏర్పాటు చేశారు. ఈ క్యాంపుకు హాజరైన వారికి పురుషులు, మహిళలకు వేర్వేరుగా కంటి వైద్య పరీక్షలు చేశారు. ప్రత్యేక వైద్య బృందం రక్త, బీపీ, షుగర్ పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. ఈ వైద్య శిబిరానికి 380మంది హాజరు కాగా 155 మందిని శస్త్ర చికిత్సకు వైద్యులు రిఫర్ చేశారు. తొలుత ఎన్‌టిఆర్ విగ్రహానికి, ఏలూరి నాగేశ్వరరావు చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. రాజకీయాలకు అతీతంగా ప్రజలందరికీ వైద్య సేవలు అందించడంలో ఎమ్మెల్యే ఏలూరికి సాటి లేరన్నారు. ప్రజాఆరోగ్యం పట్ల ఒక బాధ్యతగా నెల నెలా నిరంతరం ఎమ్మెల్యే ఏలూరి కంటి వైద్య శిబిరాలు, మెడికల్ క్యాంపులు నిర్వహిస్తూ ప్రజల అభిమానాన్ని చురుగొంటున్నారని అన్నారు. వైద్య శిబిరాలను ఎన్నికల వరకే కాకుండా నిరంతరం కొనసాగించడంలో ఏలూరికి సాటిలేరన్నారు. సమాజం పట్ల బాధ్యతగా సేవా కార్యక్రమాలు కొనసాగించడం అభినందనీయమని అన్నారు. ప్రతి ఒక్కరికి కంటి వైద్య శిబిరం ద్వారా సేవలందిస్తూ కంటి వెలుగు ప్రదాతగా ఎమ్మెల్యే ఏలూరి నిలిచాడని అన్నారు. శిభిరానికి హాజరైన వారందరికీ భోజన వసతి ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో టిడిపి అధ్యక్షులు పొద వీరయ్య, అజాద్, ఆసోది సుబ్బారెడ్డి, యార్లగడ్డ లక్ష్మి, చెరుకూరి రాఘవయ్య, బత్తుల శ్రీనివాసరావు, చిన్నగంజాం సర్పంచ్ చిన్న, నాయకులు బ్రహ్మానందరెడ్డి, శ్రీహరి, రమణారెడ్డి, రామసుబ్బారావు, వాటుపల్లి ఏడుకొండలు, కోకి భాస్కరరెడ్డి, రామాంజనేయులు, ఉదయ భాస్కరరెడ్డి, విష్ణు, సంధ్య, నాగరాజు, శ్యామ్, సతీష్, పిచ్చయ్య, వెంకటేశ్వర్లు, బెల్లంకొండ రమేష్, గడ్డం కోటయ్య, బాలరాజు, వడ్లమూడి సత్యం, శ్రీను, జయరామయ్య, శ్రీనివాసరావు, పర్వతరెడ్డి సత్యం పాల్గొన్నారు.

పెదనక్కలపాలెంలో రోటరీ ఆధ్వర్యంలో నేత్రదానం

ప్రజాశక్తి - ఇంకొల్లు

పుష్పావతి (61)

మండలంలోని పెదనక్కలపాలెంకు చెందిన ఏలూరి పుష్పావతి (61) మృతి చెందగా ఆమె కుటుంబ సభ్యులు ఆమె నేత్రాలు దానం చేశారు. గుంటూరు పెదకాకాని శంకర్ నేత్ర వైద్యశాల వైద్యులు వచ్చి ఆమె కంటి కార్నియా ఆదివారం సేకరించారు. నేత్రదానానికి అంగీకరించిన ఆమె కుటుంబ సభ్యులు సీతారావమ్మ, ఆంజనేయులు, బంగారు బాబు, అనురాధను రోటరీ అవయవ దాన కమిటీ సభ్యులు సోమేపల్లి రామ్మోహన్రావు, జట్టి వెంకటేశ్వర్లు, రోటరీ అధ్యక్షులు మొహమ్మద్ రఫీ అభినందించారు.

బుడ్డోడి సైకిల్‌పై గ్యాస్‌బండ

ప్రజాశక్తి - అద్దంకి

చిన్న సైకిల్ తో గ్యాస్ బండ దృశ్యం

ఫోటోలో సన్నివేశం ఆసక్తి కలిగించింది. సరదాగా బుడ్డోడి సైకిల్‌పై గ్యాస్‌బండ పెట్టుకుని తీసుకెళ్లడం చూస్తే ఆశ్యర్యం కలిగించింది. తల్లికి తోడుగా ఆ బుడతడి స్పందన ఔరా అనిపించింది. పట్టణంలోని సుందరయ్య భవన్ సమీపంలో ఈ దృశ్యం ఆదివారం కనిపించింది. సమాజంలో ఎన్నో వింతలు విశేషాలు చూస్తూ ఉంటాం. ఈ దృశ్యంలోని బుడతడు గ్యాస్ బండను తన చిన్నపాటి సైకిల్‌పై ఉంచి సైకిలను తొక్కుతూ ఉండడంతో ఆ ప్రాంత ప్రజలు హౌరా అని ముక్కు మీద వేలు వేసుకున్నారు. తన తల్లికి సహాయం చేయడంలో నిమగ్నమైనట్లుగా కనిపిస్తున్నాడని పలువురు ప్రశంశించారు.

పవర్ లిఫ్టింగ్‌లో నజీర్‌కు రజితం

ప్రజాశక్తి - బాపట్ల

రజిత పతకంతో నజీర్

ఒంగోలులో మినీ ఆనంద్ స్టేడియంలో నిర్వహించిన 12వ రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో బాపట్లకు చెందిన మాస్టర్ అథ్లెంట్ షేక్ నజీర్ ద్వితీయ స్థానంలో నిలిచి రజిత పతకం సాధించినట్లు తెలిపారు. పోటీల్లో 75కేజీల కేటగిరిలో 260 కిలోల బరువు ఎత్తి ద్వితీయ స్థానాన్ని సాధించినట్లు తెలిపారు. బెంజ్ ప్రెస్ అనే ఈవెంట్ ఉంటుందని తెలిపారు. ఆ ఈవెంట్లో 70కేజీల బరువు ఎత్తి బ్రాంచ్ మెడల్ సాధించినట్లు తెలిపారు. అదే విభాగంలో వచ్చే నెలలో బెంగళూరులో జరుగునున్న జాతీయ స్థాయి పోటీలకు తాను ఎంపికైనట్లు తెలిపారు. కర్ణాటకలో జరుగే పోటీలకు తనతో పాటు బాపట్లకు చెందిన తన మిత్రుడు బత్తుల సాంబశివరావుతో కలిసి పాల్గొంటామని అన్నారు. పోటీల్లో విజయం సాధించి బాపట్లకు మాస్టర్స్ అథ్లెటిక్స్ విభాగంలో మంచి గుర్తింపు తెస్తామన్నారు.

నేడు యథావిధిగా గ్రీవెన్స్

ప్రజాశక్తి - వేమూరు

తహశీల్దారు సుశీల

స్థానిక తహశీల్దారు కార్యాలయం నందు పిజిఆర్ఎల్ కార్యక్రమం సోమవారం యాదవిదిగా జరుగుతుందని తహశీల్దారు సుశీల తెలిపారు. మండలంలోని వివిధ గ్రామాల ప్రజలు ఈ అవకాశాని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రజాశక్తి
సోమవారం 9 జూన్ 2025

విద్యుత్ సమస్యలతో సతమతం

ప్రమాదకరంగా మారిన ఇనుప స్తంభాలు

ట్రాన్స్‌ఫార్మర్ మంజూరైనా బిగించని వైనం

లోఓల్టేజీతో ఇబ్బందులు పడుతున్న ప్రజలు

ప్రజాశక్తి-నాగులుప్పలపాడు

మండలంలోని మేజర్ పంచాయతీ అయిన ఉప్పుగుం డూరులో విద్యుత్ సమస్యలతో ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తరుచూ విద్యుత్ కోతలతో సతమతమ వుతున్నారు. ప్రధానంగా యూనియన్ బ్యాంకు బజారు (ఉత్తరం బజారు)లో నిత్యం విద్యుత్ సమస్యలతో ఇబ్బంద లు తప్పడం లేదు. ఈ బజారులో రెండు ప్రయివేటు పాఠశా లలు ఉన్నాయి. వాటిని ఆనుకొని ఎస్‌సి కాలనీలు ఉన్నా యి. ఆ పాఠశాలల సముదాయంలోనే తక్కువ ఎత్తులో ట్రాన్స్‌ఫార్మర్లు అమర్చారు. దీంతో పాటుగా ఏళ్ల క్రితం ఏ ర్పాటు చేసిన ఇనుప విద్యుత్ స్తంభాలు దర్శనమిస్తున్నాయి. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు, పాఠశాల విద్యార్థులు నిత్యం ఆందోళన చెందుతున్నారు.

లోఓల్టేజీతో నిత్యం సమస్యలు..

ఇదిలా ఉండగా ఉత్తరం బజారులో నిత్యంలో ఓల్టేజ్ సమస్యతో ప్రజలు పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రతిరోజూ టివిలు, ఫ్రిజ్‌లు కాలి పోతున్నాయి. ఈ నేప థ్యంలో గ్రామస్తులు పలుమార్లు ఆందోళన చేయగా ఎట్టకేల కు వైసిపి గవర్నమెంట్‌లో ట్రాన్స్‌ఫారం పవర్ పెంచి కొత్త ట్రాన్స్ ఫారం మంజూరు చేసారు. దాంతో అధికారులు మంజూరైన ట్రాన్స్‌ఫారంను యూనియన్ బ్యాంకు ఎదురు బిగిస్తుండగా ఒక వ్యాపారవేత్త తన ఇంటిప్రక్క వేస్తే ఇబ్బం దని రాజకీయ పలుకుబడితో నిలుపుదల చేయించారు. దీంతో అధికారులు వెనుతిరిగారు. అప్పటి నుంచి వేరే ప్రదేశం చూసి బిగించవలసిన అధికారులు నిమ్మకు నీరెత్తి నట్లు వ్యవహరిస్తున్నారు. ప్రభుత్వం మారి సంవత్సరకాలం పూర్తి అయినా మంజూరైన ట్రాన్స్‌ఫార్మర్ బిగింపునకు నోచుకోక పోవడంతో నేటికిలో ఓల్టేజ్ సమస్యలతో ఆ ప్రాంత ప్రజలకు ఇబ్బందులు తప్పడంలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పక్కనే ఉన్న ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించి ట్రాన్స్‌ఫార్మర్‌ను బిగించి విద్యుత్ సమస్య నుంచి కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

తెగిపడిన తీగ.. తప్పిన ప్రమాదం

శనివారం రాత్రి సరస్వతి హైస్కూల్ వద్ద మెయిన్ లైన్ విద్యుత్ తీగ తెగి క్రిందపడింది. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేక పోవడంతో పెద్దప్రమాదం తప్పింది. స్థానికులు గమనించి విద్యుత్ అధికారులకు తెలపడంతో విద్యుత్ సరఫరా నిలిపి తెగిన తీగలను జాయింట్ వేసి మమ అనిపించారు. ఇదిలా ఉండగా ఎప్పుడో ఏర్పాటు చేసిన ఇనుప స్తంభాలు తుప్పుపట్టి ఉన్నాయి. వీటికి విద్యుత్ అవుతుండటంతో ప్రమాదకరంగా మారింది. ఇనుప స్తంభాలు నేటికీ మార్చక పోవడంతో తుప్పుపట్టి ప్రమాదకరంగా మారాయి.

తుప్పు పట్టిన ఇనుప స్తంభం

వైభవంగా ధ్వజస్తంభ ప్రతిష్ట

ప్రజాశక్తి-సిఎస్ పురం: మండలంలోని పెద్దగోగులపల్లి గ్రామంలో కోదండ రామస్వామి ధ్వజస్తంభం నవగ్రహ ప్రతిష్ట కార్యక్రమాలు అత్యంత వైభవంగా జరిగాయి. ఆది వారం ఉదయం నుంచి స్వామివారికి అభిషేకాలు, పూజలు నిర్వహించారు. పండితుల మంత్రోచ్చారణల మధ్య ధ్వజ స్తంభ ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమం ఘనంగా జరి గింది. ఈ పూజా కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

టీషర్టులు అందజేత

ప్రజాశక్తి-చీమకుర్తి: చీమకుర్తి జెజెసిజి వాకర్స్ అసో సియేషన్ ఆధ్వర్యంలో అసోసియేషన్ సభ్యులకు వాకింగ్ టీ షర్టులు ప్రదానం చేశారు. ఆదివారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో టీ షర్టుల దాతలు ఎస్కే ఖాదర్ వలీ, ధనేకుల రమణయ్య, ఎస్.అంజిరెడ్డి, ఎస్‌కె షరీఫ్, ఎస్‌కే బుడే సాహెబ్ (ఐఎం జిసి) సమకూర్చిన టి షర్టులను సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా దాతలు మాట్లాడుతూ సభ్యులందరూ ఒకే యూనిఫామ్‌లో ఉండేందుకు ఈ టీషర్టులు పంపిణీ చేసినట్లు తెలిపారు.అసోసియేషన్ అభివృద్ధికి పలు కార్యక్రమాలు చేప డుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ధనేకుల రమణయ్య, ఎస్.అంజిరెడ్డి, ఉపాధ్యక్షులు ఎస్కే ఖాదర్ వలీ, గుమ్మడిదల శ్రీనివాస రావు, నారాయణరెడ్డి, జాయింట్ సెక్రెటరీ ఎస్కే బుడే సాహెబ్, జి.చంద్రమౌళి, ఎస్కే షరీఫ్, కోశాధికారి గోగి నేని గంగాధర్, గౌరవ అధ్యక్షులు ఎస్కే సుభాని తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-కొండపి: మండలంలోని కట్టావారిపాలెంలో స్థానిక స్వచ్ఛంద సంస్థ మన ఊరి ఆరోగ్య వికాసం ఆధ్వర్యంలో ఆదివారం వైద్య శిబిరం నిర్వహించి 35 మందికి ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. ఒంగోలు దేవి ఆసుపత్రి వైద్యులు డా.కంకణాల కృష్ణ మోహన్, ఆసుపత్రి సిబ్బంది శిబిరంలో పాల్గొన్నారు. డా. కృష్ణ మోహన్ మాట్లాడుతూ బి.పి, షుగరు వ్యాధులు మామూలు వ్యాధుల వలే జబ్బులు కాదనీ శరీరంలో కొన్ని గ్రంధులు సరిగా పనిచేయక పోవడం, ఇతర సాంకేతిక కారణాల వలన ఏర్పడే లోపాలని అన్నారు. 40 సంవత్సరాలు వయసు నిండిన ప్రతి ఒక్కరు అప్పుడప్పుడు షుగరు, బిపి పరీక్షలు చేయించుకుని రోగ నిర్ధారణ చేయించు కోవడం ముఖ్యమన్నారు. అశ్రద్ధ చేస్తే ముప్పు తప్పదనీ, అందరూ ధ్యానం, యోగ వంటివి సాధన చేస్తూ ప్రశాంత జీవితం అలవాటు చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు మానికొండ వెంకటేశ్వర్లు, వీరమోసు మస్తాన్, ఆరోగ్య భవనం దాత గుంటుపల్లి పద్మావతి, స్వచ్ఛంద కార్యకర్తలు పాల్గొన్నారు.

సచివాలయంలో పనిచేయని ఇంటర్‌నెట్

అలంకారంగా ఫైబర్‌నెట్ బాక్సులు

ఇబ్బందులు పడుతున్న సిబ్బంది

ప్రజాశక్తి-సిఎస్‌పురం రూరల్

ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఇంటర్నెట్ పనిచేయకపోవడంతో సీఎస్‌పురం సచివా లయ సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడుతు న్నారు. మండలంలో ఉన్న 15 సచివాల యాలలో ఫైబర్ నెట్ ఏర్పాటు ద్వారా ఇం టర్నెట్ సౌకర్యం కల్పించారు. అయితే ప్ర భుత్వం ఏర్పాటు చేసిన ఇంటర్నెట్ ఒక్క రోజు కూడా పనిచేసిన దాఖలాలు లేవు. ఫైబర్ నెట్ బాక్సులు సచివాలయాలలో అలంకారప్రాయంగా మిగిలాయి. దీంతో ఇంటర్నెట్ సౌకర్యం లేక సచివాలయాల సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సీఎస్‌పురంలోని ఒకటో సచివాలయం సి బ్బంది రూ.5 వేలు వెచ్చించి ఎయిర్టెల్ మోడెంను కొనుగోలు చేసి భవనంపైన యాంటీనాను ఏర్పాటు చేసుకొని ఇంటర్నెట్‌ను వినియోగించుకుం టూ అవస్థలు పడుతున్నారు. పలు సచివాల యాలలో సిబ్బంది తమ తమ సెల్‌ఫోన్‌లలో హాట్ స్పాట్ ద్వారా ఇంటర్నెట్‌ను విని యోగించుకుం టూ కార్యకలా పాలు కొనసాగిస్తు న్నారు. బోయ మడుగుల, పెద్ద రాజుపాలెం, ఏ.కొత్తపల్లి తదితర సచివాలయా లలో తమ ఫోన్ల ద్వారా కూడా ఇంటర్నెట్ పనిచేయడం లేదని దీంతో తీవ్ర ఇబ్బందులు పడుతు న్నట్లు ఆయా సచివాలయాల సిబ్బంది వాపోయారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సచివాలయాలకు మెరుగైన ఇంటర్నెట్ సౌకర్యం కల్పించి ఇబ్బందులు తీర్చా లని సచివాలయాల సిబ్బంది కోరుతున్నారు.

నిరుపయోగంగా ఫైబర్ నెట్ బాక్స్

కొనుగోలు చేసిన ఎయిర్‌టెల్ మోడం

వైసీపీ తప్పుడు ప్రచారాలను తిప్పి కొట్టాలి

ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి

ఘనంగా అంకాలమ్మ తిరునాళ్ల

ప్రజాశక్తి-కొనకనమిట్ల

రాష్ట్రంలో వైసీపీ చేస్తున్న అసత్య ప్రచారాలను తిప్పి కొట్టాలని శాసనసభ్యులు కందుల నారా యణరెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలో అంకాలమ్మ తిరునాళ్ల సందర్భంగా ఏర్పాటు చేసిన టిడిపి విద్యుత్ ప్రభపై ఆయన మాట్లాడారు. అంకాలమ్మ ఆశీస్సులతో గ్రామస్తులందరూ సుభిక్షం గా ఉండాలని ఆకాంక్షించారు. వైకాపా ప్రభుత్వం గత ఐదేళ్ల పాలనలో అన్ని విధాలుగా రాష్ట్రాన్ని నిర్వీర్య చేసిందని విమర్శించారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని కూటమి ప్రభుత్వం ప్రాధాన్యత క్రమంలో నెరవేర్చుతుం దని హామీ ఇచ్చారు. ఈ నెలలోనే తల్లికి వందనం, రైతులకు అన్నదాత సుఖీభవ డబ్బులను జమ చేస్తుంద న్నారు. అంకాలమ్మ దేవాలయ ఆవరణలో విద్యుత్ సౌక ర్యం ఏర్పాటు చేయాలని కొనకనమిట్ల నాయకులు ఎమ్మెల్యే కందులను కోరగా త్వరలోనే ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు మోరబోయిన బాబురావు, రాష్ట్ర కార్యదర్శి కామసాని రామిరెడ్డి, మండల మాజీ కన్వీనర్లు తాసిరెడ్డి వెంకటరెడ్డి, కనకం నరసింహారావు, వెలుగొండ ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ కొండూరు కాశిరెడ్డి, గొట్లగట్టు సర్పంచ్ పెరిక సుఖదేవ్, మండల ప్రధాన కార్యదర్శి జవాజి భాషాపతి నాయుడు, నాయకులు మూవ్ కాటంరాజు, పునుగోటి వెంకటేశ్వర్లురెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, ముక్కాల శ్రీనివాసులు, టిడిపి మండల యూత్ ఉపాధ్యక్షులు పిల్లి బ్రహ్మారెడ్డి, బిసి సెల్ నాయకులు అంకాల రోశయ్య, పులిగొర్ల శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి

ప్రమాదస్థలంలో జగదీష్ మృతదేహం

ఆటోని ఢీకొన్న ట్రాక్టర్.. డ్రైవర్ మృతి

ప్రజాశక్తి-శింగరాయకొండ

ఆటోని ట్రాక్టర్ ఢీకొనడంతో వ్యక్తి మృతి చెందిన సంఘటన శింగరాయకొండలోని జీవిఆర్ ఫ్యాక్టరీ సమీపంలో జాతీయ ర హదారిపై జరిగింది. అందిన వి వరాల మేరకు.. శింగరాయ కొండ మండలం సోమరాజు పల్లి గ్రామానికి చెందిన పొట్లేళ్ల జగదీష్ (22) ఆటో నడుపుకుం టూ మామిడికాయల కోసం శింగరాయకొండ నుంచి ఉలవ పాడుకి బయలుదేరి వెళ్తున్నాడు. ఇదే క్రమంలో శింగరాయ కొండ నుంచి ఉలవపాడుకి వెళుతున్న ట్రాక్టర్ వెనుక ట్రక్కు ఆటోని ఢీ కొట్టి లాక్కొని వెళ్లింది. ఆటో నడుపుతున్న జగదీష్ రోడ్డుమీద పడిపోవడంతో తలకు తీవ్రమైన గాయం అయి అక్కడికక్కడే మృతి చెందాడు. ట్రాక్టర్ డ్రైవర్ కొంచెం ముందు కు వెళ్ళిన తర్వాత ట్రక్కును అక్కడే వదిలేసి పరారయ్యాడు. హైవే పెట్రోలింగ్ సిబ్బంది భాస్కర లింగం, సుమన్, తిరు పతి స్వామి సీసీ కెమెరాలు పరిశీలించారు. ట్రాక్టర్ డ్రైవర్ ఎవరితోనో ఫోన్లో మాట్లాడుకుంటూ వెళ్లడం గుర్తించారు. జగదీష్ మృతదేహాన్ని కందుకూరు ఏరియా వైద్యశాలకు తరలించారు. జగదీష్ ఇటీవలే అనారోగ్యంతో ఆసుపత్రిలో చేర్పించామని, ఇప్పుడు ఆటో నడుపుకుంటూ ఉన్న సమ యంలో ఇలా ప్రమాదం జరిగి మృతి చెందడంతో కుటుంబ సభ్యులు తల్లడిల్లిపోతున్నారు. జాతీయ రహదారిపైనే మృత దేహాన్ని చూసి బోరున విలపించడం చూపరులను కంటతడి పెట్టించింది. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ధ్వంసమైన ఆటో

గుర్తు తెలియని మహిళ మృతి

ప్రజాశక్తి-శింగరాయకొండ

శింగరాయకొండ-ఉలవపాడు రైల్వే స్టేషన్ల మధ్యలో ఆదివారం నాడు గుర్తు తెలియని మహిళ (35) మృతదేహం లభ్యమైందని రైల్వే ఎస్ఐ మధుసూదన్ రావు తెలిపారు. మహిళ వద్ద ఎలాంటి ఆధారాలు లేవని ఆయన తెలిపారు. మృతదేహాన్ని ఒంగోలు రిమ్స్‌కు తరలించినట్లు తెలిపారు.

వడదెబ్బకు యాచకుడు మృతి

ప్రజాశక్తి-శింగరాయకొండ

వడదెబ్బకు శింగరాయకొండలో యాచకుడు ఆదివారం మృతి చెందాడు. యువ నేస్తం ఫౌండేషన్ చైర్మన్ అంకేపల్లి బంగారు బాబు ఆధ్వర్యంలో అంత్యక్రియలు నిర్వహించారు. మృతుడిది బాపట్ల జిల్లా రేపల్లె అని, అతని పేరు వెంకటేశ్వర్లని స్థానికులు తెలిపారు. యాచక వృత్తి చేసుకుంటూ బతుకుతుండటంతో యువ నేస్తం ఫౌండేషన్ యువకులు అంత్యక్రియలు నిర్వహించారు.

ఇంటి ముందు మద్యం తాగొద్దన్నందుకు..

బీరు బాటిల్‌తో దాడి

ప్రజాశక్తి-శింగరాయకొండ

తన ఇంటి ముందు మద్యం తాగొద్దు అన్నందుకు బీరు బాటిల్స్‌తో దాడి చేసి గాయపరిచిన సంఘటన శింగరాయ కొండ మండలం సోమ రాజు పల్లిలో చోటుచేసుకుంది. తన్నీ రు రవి అనే వ్యక్తి ఇంటిముందు బింగి నపల్లి గ్రామానికి చెందిన మణికంఠ మరో వ్యక్తితో మద్యం సేవిస్తున్నాడు. తన ఇంటి ముందు మద్యం తాగవ ద్దని, ఇక్కడ మహిళలు ఉన్నా రని, ఇది మంచి పద్ధతి కాదని తన్నీరు రవి చెప్పాడు. అప్పటికే మద్యం మత్తులో ఉన్న మణికంఠ, మరో వ్యక్తి మాకే చెబు తావా అంటూ బీరు బాటిళ్ల తీసుకొని తలపై కొట్టారు. తీవ్ర గాయాలైన తన్నీరు రవిని కందుకూరు ఏరియా వైద్యశాలకు తరలించి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గాయపడిన రవి

పర్యాటకులతో సూర్యలంక బీచ్‌లో సందడి

● విడిది సౌకర్యాలు లేక పర్యాటకుల పాట్లు ● బీచ్‌లో లోపించిన పారిశుధ్యం

సూర్యలంక బీచ్‌లో పర్యాటకుల సందడి

ప్రజాశక్తి - బాపట్ల

సూర్యలంక బీచ్‌కు ఆదివారం పర్యాటకులు పోటెత్తారు. పాఠశాలలకు సెలవులు ముగియనుండటంతో రెండు తెలుగు రాష్ట్రాల నుండి పర్యాటకులు ప్రత్యేక వాహనాల్లో సూర్యలంక బీచ్‌కు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ముస్లింలు బక్రీద్ పండుగ అనంతరం రెండో రోజు సముద్ర స్నానాలు చేయటం ఆనవాయితీగా ఉన్న నేపథ్యంలో అధిక శాతం ముస్లింలు సూర్యలంక బీచ్‌లో సముద్ర స్నానాలు ఆచరించారు. దీంతో సూర్యలంక తీరం సందర్శకులతో కిటకిటలాడింది. వేలాది మంది పర్యాటకులకు భద్రత కల్పించి ప్రమాదాల నివారణకు బాపట్ల రూరల్, సూర్య లంక మెరైన్ పోలీసులు గట్టి భద్రతా చర్యలు చేపట్టారు. బీచ్‌లో వాచ్ టవర్లపై నుండి పర్యవేక్షిస్తూ పోలీసులు ఎప్పటికప్పుడు ప్రమాద హెచ్చరికలు జారి చేశారు. పర్యటకులు సముద్ర స్నానాలు సమయంలో ప్రమాదాల బారిన పడకుండా అత్యంత జాగ్రత్తలు తీసుకున్నారు. సముద్ర స్నానాల అనంతరం పర్యాటకులు విచ్చేసిన ప్రత్యేక వాహనాలను బాపట్ల, సూర్యలంక మార్గంలో అటవీ ప్రాంతంలో అల్పాహారం భోజనాలు చేసేం దుకు చెట్ల కిందకు చేరారు. ఎండ వేడిమికి సూర్య లంకలో పర్యాటకులు ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అయ్యారు.

అరకొర సౌకర్యాలతో అవస్థలు

ఆహ్లాదంగా సూర్యలంకలో సముద్ర స్నానాలు ఆచరించి అనంతరం సేదతీరేందుకు బీచ్‌లో సరైన సౌకర్యాలు లేక పర్యాటకులు కొంత ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సూర్యలంక బీచ్‌లో ప్రైవేట్ వ్యక్తులు ఏర్పాటు చేసిన గొడుగులు కింద రుసుం చెల్లించి సేద తీరాల్సి వస్తోంది. అయినప్పటికీ అవీ అరకొరగా ఉండడంతో పర్యాటకులు ఎండ దెబ్బకు నిలువ నీడ లేక అల్లాడిపోయారు. సూర్యలంక అభివృద్ధికి నిధులు మంజూరైనప్పటికి పర్యాటకులకు సౌకర్యాలు కల్పించేందుకు ఎక్కడెక్కడ ఏమేమి అభివృద్ధి చేస్తారనే అంశాన్ని ఇప్పటివరకు ప్రకటించలేదు. గత రెండు రోజులగా సెలవు దినాలు కావడంతో సూర్యలంకలో విడిది చేసేందుకు పర్యాటక శాఖకు చెందిన వసతి గృహాలు దొరకలేదు. దీంతో ప్రైవేటు రిసార్ట్స్‌లో సైతం గదులు దొరక్క అనేక మంది పర్యాటకులు విడిది కోసం సమస్యలు ఎదుర్కోవాల్సి వచ్చింది. దీంతో పట్టణంలోని వసతి గృహాలు పర్యాటకుల తాకిడితో గిరాకీ పెరిగింది. ముందుగా రూములు బుక్ చేసుకోలేని తెలంగాణ ప్రాంత నుండి కుటుంబ సమేతంగా వచ్చిన పర్యాటకులకు వసతి గృహాలు దొరక్క ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

చెత్త మయంగా మారిన సూర్యలంక బీచ్

గత రెండు రోజులుగా పర్యటకుల తాకిడితో సూర్యలంక బీచ్ చెత్త మయంగా మారింది. ప్లాస్టిక్ నియంత్రణ లోపించడంతో తీర ప్రాంతం ప్లాస్టిక్ మయంగా మారింది. పర్యాటకులు భోజనాలు చేసిన ప్లేట్లు సైతం ఎక్కడ పెడితే అక్కడ పడటంతో బీచ్ మరింత దుర్గంధంగా మారింది. పారిశుద్యం నిర్వహణపై సంబంధిత అధికారులు దృష్టి పెట్టడం లేదు. బీచ్ క్లీన్‌గా ఉంచాలని అధికారులు అప్పుడప్పుడు నిర్వహించే స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలకు అధికారులు సూర్యలంకకు విచ్చేసిన సమయాల్లో మాత్రం పెద్ద ఎత్తున పారిశుధ్య కార్మికులను మోహరించి పరిశుభ్రంగాగా ఉంచుతారు. తిరిగి సూర్యలంక బీచ్ క్లీనింగ్‌పై నిర్వాహకులకు శ్రద్ధ కొరబడుతోంది. అసలే వాతావరణంలో చోటు చేసుకుంటున్న మార్పులతో వేలాదిమంది ప్రజలు పర్యాటకుల సందర్శించే బీచ్ పరిశుభ్రతపై పట్టించుకోవడం లేదని పర్యాటకులు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పర్యాటకులు, కుటుంబ సమేతంగా చిన్నారులతో విచ్చేసిన సమయాల్లో బీచ్ పరిశుభ్రంగా ఉంచాలని కోరుతున్నారు.

గొడుగుల కింద సేద తీరుతున్న పర్యాటకులు

డిఎస్‌సి పరీక్షలకు హాజరైన అభ్యర్థులు

సెయింట్ ఆన్స్‌లో డీఎస్సీ పరీక్షలు

ప్రజాశక్తి - వేటపాలెం

స్థానిక సెయింట్ ఆన్స్ ఇంజనీరింగ్ కాలేజీలో డీఎస్సీ పరీక్షలు ఆన్లైన్ పద్ధతిలో అత్యాధునిక కంప్యూటర్ ల్యాబ్ నందు ప్రశాంత వాతావరణంలో కొనసాగుతున్నయని కళాశాల సెక్రెటరి వనమా రామకృష్ణరావు తెలిపారు. ఆదివారం జరిగిన డీఎస్సీ పరీక్షలకు ఉదయం 220మంది అభ్యర్థులకు 210మంది హాజరుకాగా, మధ్యాహ్నం 220మంది అభ్యర్థులకు 189 మంది హాజరైనట్లు తెలిపారు. పరీక్షలకు అబ్జర్వర్లుగా చీరాల ఎంఈఓ వ్యవహరించారు. అనంతరం ఎంఈఓ మాట్లాడుతూ డీఎస్సీ పరీక్షలు సెయింట్ ఆన్స్ పరీక్షా కేంద్రంలో జూన్ 29వరకు కొనసాగుతాయని తెలిపారు. అభ్యర్థులు సకాలంలో పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని కోరారు.

కుట్టు శిక్షణ సామాగ్రిని అందజేస్తున్న సాయిబాబా

మహిళలకు ఉచిత కుట్టు శిక్షణ

ప్రజాశక్తి - భట్టిప్రోలు

భట్టిప్రోలు ఫ్రెండ్స్ అసోసియేషన్ సేవా కార్యక్రమంలో భాగంగా అద్దేపల్లిలో మహిళలకు ఉచిత కుట్టు శిక్షణ కేంద్రంను టీడీపీ రాష్ట్ర కార్యదర్శి తునుగుంట్ల సాయిబాబా ఆదివారం ప్రారంభించారు. ఇప్పటికే కొంత మంది మహిళలకు మొదటి బ్యాచ్ శిక్షణ అందించినట్లు నిర్వాహకులు బొలిశెట్టి శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా సాయిబాబా మాట్లాడుతూ ఈ శిక్షణ కేంద్రం ద్వారా మహిళల ఆర్థిక అభివృద్ధికి తోడ్పాటు అందించినట్లు అవుతుందని అన్నారు. దాదాపు 15 మంది మహిళలకు మూడు నెలలు పాటు కుట్టు శిక్షణ ఇస్తారని తెలిపారు. బొలిశెట్టి జయబాబు ఆర్థిక సహకారంతో నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమంలో బిఎఫ్ఎ ఈసి సభ్యులు బొలిశెట్టి శ్రీనివాసరావు, పసుపులేటి శివరామప్రసాద్, మద్దుల చంద్రకిషోర్, ట్రైనర్ బొడ్డు నాగమణి పాల్గొన్నారు.

10న సిఐటియు జిల్లా విస్తృత స్థాయి సమావేశం

ప్రజాశక్తి - బాపట్ల

సిఐటియు బాపట్ల జిల్లా విస్తృత సమావేశం ఈనెల10న బాపట్లలోని పుచ్చలపల్లి సుందరయ్య ప్రజా సంఘాల కార్యాలయంలో జరుగుతుందని సిఐటియు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సిహెచ్ మణిలాల్, సిహెచ్ మజుందార్ ఆదివారం తెలిపారు. సమావేశానికి సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కె ధనలక్ష్మి హాజరవుతారని తెలిపారు. సమావేశంలో జులై 9న జరుగ నున్న దేశ వ్యాప్త సమ్మె, రాష్ట్ర ప్రభుత్వం 8గంటల నుండి 10 గంటలకు పని దినంపెంపుపై చర్చించనున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం యజమానులకు అనుకూలంగా ఏకపక్షంగా నిర్ణయం తీసుకోవడం దుర్మార్గమైన చర్యని పేర్కొన్నారు. ఈ పాటికే కేంద్రప్రభుత్వం కార్మిక చట్టాల స్థానంలో లేబర్ కోడ్ బిల్లులు తీసుకొచ్చి కార్మిక వర్గానికి తీరని అన్యాయం చేస్తున్నారని అన్నారు. ఈ విధానాలకు నిరసనగా దేశవ్యాప్తంగా కార్మికవర్గం ఆందోళనకు సిద్దమైనట్లు తెలిపారు. అదే బాటలో రాష్ట్ర ప్రభుత్వం ఉందని పేర్కొన్నారు. భవిష్యత్తు కార్యాచరణ రూపొందించుకోవడానికి డిసెంబర్లో జరుగనున్న సిఐటియు ఆల్ ఇండియా మహాసభలపై చర్చ జరుగుతుందని తెలిపారు. సమావేశానికి జిల్లాలోని సిఐటియు అనుబంధ సంఘాల నాయకులు హాజరు కావాలని కోరారు.

దళితులు కాబట్టే లాఠీలతో కొట్టారు

తెనాలి ఘటనలో పోలీసులపై చర్యలు తీసుకోవాలని బిఎస్‌పి డిమాండ్

ప్రజాశక్తి - చీరాల

చట్టాన్ని రక్షించాల్సిన పోలీసులు చట్టాన్ని చేతిలోకి తీసుకోని దళితులపై విచక్షణా రహితంగా నడిరోడ్డుపై లాఠీలతో కొట్టి భయభ్రాంతులకు గురి చేసిన ఘటన అమానుషమని ఎఐ బిఎస్‌పి రాష్ట్ర కార్యదర్శి ధరణికోట లక్ష్మి నారాయణ పేర్కొన్నారు. దళిత యువకులపై పాశవికంగా దాడిచేసిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆల్ ఇండియా బహుజన సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో తెనాలిలో దళిత యువకులపై పోలీసు చట్ట వ్యతిరేక చర్యలను ఖండిస్తూ స్థానిక ముక్కోణం పార్క్ సెంటర్లోని డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహం వద్ద ఆదివారం నిరసన తెలిపారు. దళితులనే చులకన భావన తగదని అన్నారు. నియోజకవర్గం అధ్యక్షులు గొర్రెపాటి రవి కుమార్ మాట్లాడుతూ తప్పు చేసిన వారిని చట్టపరంగా శిక్షించాలి కానీ చట్టాని చేతిలోకి తీసుకునే హక్కు పోలీసులకు ఎవరు ఇచ్చారని ప్రశ్నించారు. దళిత యువకులపై దాడి చేసిన పోలీసులను విధుల నుండి తప్పించాలని అన్నారు. దళిత యువకులు కాబట్టే నడిరోడ్డుపైన పోలీసులు లాఠీలతో కొట్టారని, నేరస్తులందరిని సమానంగా చూడాలని అన్నారు. కార్యక్రమంలో నాయకులు డొక్కా జగన్ మోహన్, కాటి మార్క్, డొక్కా దానియేలు, పుల్లయ్య, అర్జునరావు, సుధాకర్, వందనం, పృథ్వి, అదాం, ఎలీషా, శ్రీను, చిరంజీవి, నాగయ్య పోల్గొన్నారు.

నిరసన తెలియజేస్తున్న బీఎస్పీ నాయకులు

సూర్యలంక బీచ్‌లో యువకుడిని కాపాడిన పోలీసులు

ప్రజాశక్తి - బాపట్ల

సూర్యలంక బీచ్‌లో సముద్ర స్నానం చేస్తూ అలల తాకిడికి కొట్టుకుపోతున్న ఓ వ్యక్తిని మెరైన్ పోలీసులు కాపాడారు. ఆదివారం పెద్ద సంఖ్యలో సూర్యలంక సముద్ర తీరానికి ప్రజలు తరలివచ్చారు. అలల తాకిడికి కొట్టుకుపోతున్న భట్టిప్రోలు మండలం అద్దెపల్లి గ్రామానికి చెందిన చేబ్రోలు కిషోర్ అనే వ్యక్తిని మెరైన్ పోలీసులు గజ ఈతగాళ్ళు కాపాడారు. ఈ సందర్భంగా మెరైన్ ఎస్ఐ శ్రీనివాసరావు మాట్లాడుతూ సముద్ర స్నానాలకు వచ్చే పర్యాటకులు సముద్రంలో స్నానాలు చేసేటప్పుడు అత్యంత జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. లోతుకు వెళ్లి ప్రాణాలు మీదకు తెచ్చుకోవద్దన్నారు. సూర్యలంక పర్యటన ఆహ్లాదకరంగా గడుపుకోవాలన్నారు. విషాదం కారాదని సూచించారు. బీచ్‌లో సముద్ర స్నానానికి వెళ్లే పర్యాటకులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. లోతు ప్రాంతాలకు వెళ్లవద్దని చెప్పారు. పోలీసువారి హెచ్చరికలు పాటిస్తూ సూర్య లంక బీచ్ లో సముద్ర స్నానాలు ఆచరించి ఆనందంగా తిరిగి గమ్య స్థానాలకు చేరాలని ఆయన కోరారు.

యువకుడిని కాపాడిన మెరైన్ పోలీసులు

మాట్లాడుతున్న సినీనటులు రఘుబాబు

సినీ నటుడు గిరిబాబు జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి - మేదరమెట్ల

కొరిసపాడు మండలం రావినూతల గ్రామంలో సినీ నటులు రఘుబాబు ఆధ్వర్యంలో ఘనంగా సినీ నటుడు గిరిబాబు 83వ జన్మదిన వేడుకలు ఆదివారం నిర్వహించారు. ముందుగా అభిమానులు శుభాకాంక్షలు తెలుపుతూ కేకును కట్ చేశారు. ఈ సందర్భంగా రఘుబాబు మాట్లాడుతూ సొంత ఊరు రావినూతల అంటే తమ తండ్రికి చాలా ఇష్టమని అన్నారు. ఏ కార్యక్రమం జరిగిన తప్పకుండా వస్తుంటారని చెప్పారు. గ్రామస్తులు, అభిమానులతో కలిసి ఉండటం అంటే తనకు ఇష్టమని అన్నారు. గ్రామంతో తనకున్న అనుబంధం, మిత్రులను ఎప్పుడూ గుర్తు చేస్తుంటారని అన్నారు. కొన్ని ఆరోగ్య సమస్యల కారణంగా రాలేక పోయారని చెప్పారు. జూన్ నెలలో వస్తారని తెలిపారు. గ్రామంలో అందరితో కలిసి మాట్లాడుతారని అన్నారు. అభిమానులు మాట్లాడుతూ ఇటువంటి జన్మదినాలు మరెన్నో జరుపుకోవాలని కోరారు. గ్రామ అభివృద్ధిలో ఆయన సహకారం అభినందనీయం అన్నారు. కార్యక్రమంలో రూరల్ సీఐ మల్లికార్జునరావు, కొరిశపాడు ఎస్ సురేశ్, డాక్టర్ హృదయనాథ్ పాల్గొన్నారు.

రేణుకాంబ ఆలయ వార్షికోత్సవం

ప్రజాశక్తి - యద్దనపూడి

మండలంలోని చింతపల్లిపాడు గ్రామంలోని శ్రీ రేణుకాంబ అమ్మ దేవాలయం వార్షికోస్తావం జూన్ 9న నిర్వహిస్తున్నట్లు ఆలయ ప్రతినిధి జె శ్రీనివాసరావు తెలిపారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు జరుగుతాయని తెలిపారు. పూజల అనంతరం భక్తులకు పండ్లు, తీర్థ ప్రసాదాలు అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

లోతైన దుక్కులతో భూసారం మెరుగు

• అదునులోనే అప్రమత్తమైతే బహుళ ప్రయోజనాలు • వ్యవసాయ శాఖ ఏడిఎ విజయబాబు

దుక్కులు సిద్ధం చేస్తున్న రైతులు

ప్రజాశక్తి - రేపల్లె

వర్షా కాలం, వేసవి కాలం (ఖరీఫ్, రబీ) పంటల తర్వాత తిరిగి వర్షా కాలం వచ్చే వరకు చాలా మంది రైతులు అవగాహన లేక భూమిని దున్నకుండా అలాగే వదిలేస్తారు. దీంతో భూమిలో కలుపు మొక్కలు పెరిగి భూమిలోని నీటిని, పోషక పదార్థాలను గ్రహించి భూమికి సత్తువ లేకుండా చేస్తాయి. అదే వేసవిలో లోతుగా దుక్కులు దున్ని పెడితే బోలెడు లాభాలు ఉన్నాయని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. లోతు దక్కులతో భూమి పైపొరలు కిందికి, కింది పొరలు పైకి తిరగబడి నేల సారవంతంగా మారుతుంది. వేసవి కాలంలో లోతు దుక్కులతో చాలా ప్రయోజనాలున్నాయని అధికారులు చెబుతున్నారు. వర్షాలకు ముందు భూమిని దున్నడం వల్ల తొలకరి వర్షాలు పడగానే నీరు భూమిలోకి ఇంకి కోతకు గురికాకుండా ఉంటుంది. దీంతో భూమిలో తేమశాతం పెరిగి భూసారం వృద్ధి చెందుతుంది. పురుగులు, తెగుళ్ల యాజమాన్యం, కలుపు మొక్కల నివారణతోపాటు ఎక్కువ ప్రయోజనాలు సమకూరుతాయి. వేసవి లోతు దుక్కులు దున్నే ముందు పశువులు, ఆవులు, గొర్రెల పేడ, కంపోస్టు ఎరువు, మట్టిని వెదజల్లడం ద్వారా భూమి సారవంతమై పంట దిగుబడి పెరుగుతుంది. లోతు దుక్కులు నేలను చదును చేసే పనులే కాకుండా వేసవిలో వచ్చే జల్లులు, తొలకరి వర్షాలకు ఉపయోగించుకుని నేల అవసరాన్ని బట్టి పైపొరల్లోని కలుపు విత్తనాలు చాలా వరకు మొలక దశలోనే అంతరించిపోతాయి. ఇతర కలుపు జాతులైన ఊద, చిప్పెర, ఉర్రంగి, నేల ఉసిరి తదితర మొక్కలుంటే లోతు దుక్కులు దున్నడం వల్ల నశిస్తాయి. ఆరు తడి పంటగా వరి సాగు చేసినప్పుడు, పత్తి, మిరప, మొక్కజొన్న, మినుము, పెసర తదితర పంటల సాగుకు ముందే వేసవిలో లోతు దుక్కులు దున్నుకోవాలి. ఎండకు సైతం భూమి పోరల్లోకి చొచ్చుకుని వెళ్లి క్రిమి కీటకాలను నాశనం చేస్తుందనీ వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు.

లోతైన దుక్కులతో పెరగనున్న భూసారం

రైతులు వేసవి వెళ్లక ముందే లోతైన దుక్కులు దున్నాలి. పొలానికి అడ్డంగా దున్నడంతో భూమిలోని చీడ పురుగులు నశించిపోతాయి. తగినంత తేమ ఉన్నప్పుడు దుక్కులు వాలుగా లోతుగా దున్నితే నేల కోతకు గురవకుండా ఉంటుంది. దున్నిన తర్వాత రైతులు పంట సాగుకు వేపగింజల మిశ్రమాన్ని చేలో పిచికారీ చేయాలి. దీంతో క్రిమి కీటకాలు పంటను ఆశించవు. క్రిమి సంహారక మందులు వాడకుండా ఉండడమే మంచిదని వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు.

భూసార పరీక్షలు తప్పనిసరి

రైతులు నేలలో లభ్యమయ్యే పోషకాలపై అవగాహన పెంచుకోవడం వలన ఏ నేలలో ఏ పంట వేస్తే మంచి దిగుబడులు వస్తాయో తెలుసుకుని పంట వేయడం వలన ఆశించిన దిగుబడులు సాధించవచ్చు. ప్రతి రైతు వారి పొలంలో భూసార పరీక్షలు తప్పని సరిగా చేయించుకోవాలి. ఈ భూసార పరీక్షల వల్ల భూమిలోని పోషక విలువలు తెలియడంతోపాటు పంటల దిగుబడులకు అవసరమైన ఎరువులను ఏ మోతాదులో వాడాలో రైతులు తెలుసుకోవడానికి వీలు కలుగుతుంది. తద్వారా పంట సాగు ఖర్చులు కూడా తగ్గవచ్చు.

పచ్చిరొట్ట పైర్లు సాగు చేయాలి

ఏడిఎ ఆర్ విజయబాబు

పచ్చిరొట్ట పైర్లైన పిల్లిపెసర, జనుము, జీలుగ దుక్కుల అనంతరం పొలంలో వేయడం వల్ల భూసారం పెరిగి అధిక దిగుబడులు వస్తాయని ఏడిఎ ఆర్ విజయబాబు తెలిపారు. అంతే కాకుండా ఖరీఫ్ సీజన్లో పండించే వరికి, రబీ సీజన్లో పండించే మినుము, పెసర, మొక్క జొన్న, తెల్ల జొన్న వంటల్లో చీడపీడలను తట్టుకునే శక్తి ఈ పచ్చిరొట్ట పైర్లు వేసిన పొలాల్లో ఎక్కువగా ఉంటుందని తెలిపారు. ప్రస్తుతం ప్రతి రైతు సేవ కేంద్రం ద్వారా సబ్సిడీపై పచ్చిరొట్ట పైర్ల విత్తనాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. జనము 10కేజీలు రూ.1090 ఉండగా సబ్సిడీ 50శాతం పోను రూ.545, పిల్లి పెసర 10కేజీలు రూ.1440పై సబ్సిడీ పోను రూ.740, జీలుగా 10కేజీలు రూ.1230 ఉండగా సబ్సిడీ పోను రూ.615కు ఇస్తారని తెలిపారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

క్రీడాకారులతో ఎమ్మెల్యే కొండయ్య, గౌరీ అమర్నాథ్

యువత క్రీడల్లో రాణించాలి

ప్రజాశక్తి - చీరాల

యువత చదువులతో పాటు క్రీడల్లో కూడా రాణించాలని శాసన సభ్యులు ఎంఎం కొండయ్య అన్నారు. మండలంలోని వివిధ ప్రాంతాల్లో నిర్వహించిన క్రీడా పోటీల్లో గెలుపొందిన విజేతలకు ఆదివారం ఏర్పాటు చేసిన బహుమతుల పంపిణీలో ఆయన తనయుడు, టిడిపి యువనేత గౌరీ అమర్నాద్‌తో కలసి హాజరై మాట్లాడారు. క్రీడల్లో పాల్గొనడం వలన శరీర దృఢత్వంతోపాటు మంచి ఆరోగ్యం లభిస్తుందని అన్నారు. ఈ సందర్భంగా పాపాయిపాలెం శ్రీకృష్ణ యాదవ్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రాష్ట్రస్థాయి రెడ్ టెన్నిస్ క్రికెట్ టోర్లమెంట్, వాడరేవులో ఏర్పాటు చేసిన ప్రీమియం లీగ్ 2025 సీజన్ 10 క్రికెట్ టోర్లమెంట్ ముగింపు, కొత్తపేట సంపత్ నగర కాలనీలో నిర్వహించిన చిన్ని మెమోరియల్ ఎస్ఎన్‌సిసి యూత్ కిట్టి క్రికెట్ టోర్నమెంట్ ముగింపు వేడుకల్లో బహుమతులు పంపిణీ చేశారు.

వాడరేవు తీరంలో యువకుడు మృతి

ప్రజాశక్తి - చీరాల

అభిషేక్ ప్రభు (23)

ఇంకొల్లు మండలంలోని గంగవరంకు చెందిన అభిషేక్ ప్రభు (23) మరో ఇద్దరు స్నేహితులతో కలిసి ముగ్గురూ వాడరేవు సముద్ర తీరంకు సముద్ర స్నానానికి చేరుకున్నారు. ముగ్గురూ సముద్రంలో మునుగుతుండగా అలల తాకిడికి అభిషేక్ ప్రభు గురికావడంతో గమనించిన తోటి స్నేహితులు అతనిని కాపాడే ప్రయత్నం చేసినప్పటికీ ఫలితం లేకపోయింది. దీంతో అభిషేక్ ప్రభు సముద్రంలోని అలలకు కొట్టుకుపోయాడు. కొద్ది సేపటికి మృతి చెంది ఒడ్డుకు చేరుకున్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతునికి భార్య, 11 నెలల పాప ఉన్నారు.

ప్రహరీ గోడ కూలి మహిళ మృతి

ప్రజాశక్తి - చీరాల

ప్రహరీ గోడ కూలి మహిళ మృతి చెందిన సంఘటన పట్టణంలోని 33వ వార్డు మరియమ్మపేటలో ఆదివారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం మరియమ్మపేటలో నివాసం ఉంటున్న ఆంద్ర రోజ్ మేరీ (43) స్థానిక సెయింట్ ఆన్స్ ఇంగ్లీష్ మీడియం స్కూల్లో ఆయా పని చేస్తూ జీవనం సాగిస్తుంది. ఆమె ఇంటి పక్కనే నివాసం ఉంటున్న హనుమంతరావు తన ఇంటికి గతంలో మేరకతోలి ఎత్తుగా ప్రహరీ గోడ నిర్మించుకున్నాడు. అయితే గోడ నిర్మాణంలో ఎలాంటి పిల్లర్లు లేకపోవటంతో గోడ పగుళ్ళు ఏర్పడి కూలేందుకు సిద్ధంగా ఉంది. మృతురాలు రోజ్‌మేరీ, ఆనంద్ గోడ కులేలా ఉందని, వెంటనే మరమ్మత్తులు చేయించుకోవాలని హనుమంతరావుకు పలు మార్లు సూచించారు. ఈ నేపథ్యంలో ఆదివారం గోడ పగలుగొట్టి గోడ నిర్మించుకునేందుకు హనుమతురావు సిద్ధమై గోడ నిర్మాణం చేపడుతున్నామని, ఇంటిలోని సామాగ్రిని ప్రక్కకు తరలించుకోవాలని సూచించారు. ఆ వెంటనే బేల్దారి కూలీలతో పనులు ప్రారంభించాడు. అయితే మృతురాలు రోజ్‌మేరీ సామాన్లు తరలించి గోడ ప్రక్కనే ఉన్న పూల కుండీలను భర్త ఆనంద్‌తో కలిసి తీస్తుండగా గోడ విరిగిపోయి ఒక్కసారిగా ఆ దంపతులపై కుప్ప కూలింది. ఈ ఘటనలో రోజ్ మేరీ మృతి చెందగా ఆమె భర్త ఆనంద్ తల, కాలికి తీవ్ర గాయాలు కావటంతో పట్టణంలోని ప్రైవేట్ వైద్యశాలలో చికిత్స కోసం తరలించారు. ప్రస్తుతం చికిత్స పొందుతున్నారు. కాగా మృతురాలు రోజ్‌మేరీ మృతహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించారు. సమాచారం అందుకున్న 2వ పట్టణ పోలీసులు బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఆయాగా పనిచేస్తూ కుటుంబానికి పోషణగా ఉన్న ఆమె మృతి చెందడం, భర్త హాస్పిటల్ పాలవటంతో ఆ కుటుంబాన్ని ప్రభుత్వమే ఆదుకోవాలని బంధువులు కోరుతున్నారు.

కూలిన ప్రహరీ, మృతి చెందిన రోజ్‌మేరీ

అమరావతిపై వ్యాఖ్యలతో మహిళలను అవమానించారు

ప్రజాశక్తి - మార్టూరు రూరల్

జగన్మోహన్‌రెడ్డి తన ఐదేళ్ల పాలనలో చేసిన విధ్వంసాలు, కుంభకోణాల నుంచి ప్రజల దృష్టి మళ్ళించేందుకే దిగజారుడు రాజకీయాలు చేస్తున్నాడని ఎంఎల్‌ఎ ఏలూరి సాంబశివరావు ఆరోపించారు. తన అక్రమ మీడియాతో అమరావతిపై వ్యాఖ్యల్లో మహిళలను అవమానించారని పేర్కొన్నారు. ఆచార్య నాగార్జునుడు ప్రపంచస్థాయి విశ్వ విద్యాలయం నిర్వహించిన ప్రాంతం అమరావతి అని పేర్కొన్నారు. ప్రముఖ బౌద్ధ క్షేత్రం, శాతవాహనుల రాజధాని, బడుగు, బలహీన వర్గాలు అధికంగా ఉన్న ప్రాంతం, నవ్యాంధ్ర ప్రజా రాజధాని అమరావతి అన్నారు. ఇంతటి పవిత్రమైన, ప్రముఖమైన అమరావతిపై సాక్షి చానల్లో జగన్ డైరక్షన్ లేకుండా నీచాతి నీచమైన దుష్ప్రచారం, దాడి చేయడం జరగదని అన్నారు. అమరావతిపై దుష్ప్రచార దాడి చేయించినందుకు, మహిళల శీల హననం చేయించినందుకు జగన్‌మోహన్‌రెడ్డి వెంటనే రాష్ట్ర ప్రజలకు, మహిళలకు, బడుగు బలహీన వర్గాలకు, ఆధ్యాత్మికవాదులకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. సైకోకి, ఆపార్టీకి '11' సీట్లకే ప్రజలు పరిమితం చేసినా మార్పు రాలేదని అన్నారు. ఇటువంటి నీచమైన వ్యాఖ్యలు సమాజానికి ప్రమాదం అన్నారు. నీచానికి దిజారిన జగన్ వైఖరిని ప్రజలు, మేధావులు, ప్రజాసంఘాలు, ప్రజా స్వామ్యవాదులు ఖండించాలని కోరారు. ఈ తీవ్ర నేరపూరిత ప్రచారంపై ప్రభుత్వం, మహిళా కమిషన్, ఎస్సీ కమిషన్, ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా తగు చర్యలు తీసుకోవాలని కోరారు. భవిష్యత్తులో ఇలాంటి నీచ ప్రచారం జరగకుండా వుండాలంటే ప్రజలందరూ నిరసనలు తెలియజేయాలని పేర్కొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ పగలగొట్టిన దృశ్యం, వదిలేసిన టూల్‌కిట్

పట్టపగలే ట్రాన్స్‌ఫార్మర్ చోరీ

ప్రజాశక్తి - అద్దంకి

మండలంలోని తిమ్మాయపాలెం ఎత్తిపోతల పథకం పథకం వద్ద ఉన్న 400కెవి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను గుర్తు తెలియని ఆరుగురు వ్యక్తులు ఆదివారం మధ్యాహ్నం పగులగొట్టి అందులోని విలువైన రాగివైరు దొంగిలించారు. పశువుల కాపర్లు గమనించడంతో దొంగలు అక్కడి నుండి పరారయ్యారు. విషయం తెలుసుకున్న గ్రామస్థులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఈ ఎత్తిపోతల పథకం పరిధిలో దాదాపు 1245 ఎకరాలు భూమి సాగు చేస్తున్నారు. గతేడాది ఇదే సమయంలో ట్రాన్స్‌ఫార్మర్ పగలగొట్టి లోపల ఉన్న రాగి వైరు చోరి చేసిన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎత్తిపోతల పథకం వద్ద ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్ ఎడ్జ్ ఫీజులను తొలగించి విద్యుత్ సరఫరా లేకుండా చేసి టూల్ కిట్టు సహాయంతో ట్రాన్స్‌ఫార్మర్‌ను కిందపడవేసి లోపల ఉన్న రాగి వైరును కొంతమేర తొలగించారు. ఇది గమనించిన పశువుల కాపరులు దగ్గరకు వచ్చి ఇది ఏమిటని ప్రశ్నించడంతో వెంట తెచ్చుకున్న టూల్ కిట్ కూడా వదిలేసి అక్కడ నుంచి పరారయ్యారని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. గతంలో రూ.4లక్షల వ్యయంతో ఈ ట్రాన్స్‌ఫార్మర్‌ను రైతులు, నీటి సంఘం బాధ్యులు అప్పులు చేసి ఏర్పాటు చేశారు. ఇంతవరకు ఆ అప్పు కూడా తీరలేదు. మళ్లీ ట్రాన్స్‌ఫార్మర్‌ను పగలగొట్టడంతో మరో రూ.3లక్షల ఖర్చు కాగలదని నీటి సంఘం బాధ్యులు పరిటాల శ్రీనివాసరావు అంచనావేసి చెబుతున్నారు. ఈ ఘటనపై పోలీసులు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని గ్రామస్తులు కోరుతున్నారు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు ఆ ప్రాంతానికి వెళ్లి గుర్తుతెలిన దొంగల కోసం వెతీయవరు. విద్యుత్ అధికారులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

రైతులు అనేక వ్యయ ప్రయాసాలతో వ్యవసాయాన్ని చేస్తుంటే ఎత్తిపోతల పథకం అనేకసార్లు చోరీకి గురవుతుండటంతో ఆ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంట సీజన్ వచ్చే సమయానికి ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసుకోవాల్సిన పరిస్థితి ఉందని, ఈపాటికే రైతాంగం అనేక నష్టాల ఊబిలో ఉన్నారని రైతులు కె హనుమంతరావు, శ్రీనివాసరావు ఆవేదన వ్యక్తం చేశారు.

విరాళం చెక్కు అందజేస్తున్న దాత

మండప నిర్మాణానికి విరాళం

ప్రజాశక్తి - అద్దంకి

సింగరకొండ శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి రాతి ముఖ మండప నిర్మాణానికి పట్టణానికి చెందిన కల్లగుంట మాధవరావు, అన్నపూర్ణ దంపతులు, వారి కుమార్తె పావని కలసి దేవస్థానం సీనియర్ అసిస్టెంట్ మధుమోహనకు రూ.20230 నగదును విరాళంగా అందించారు. కార్యక్రమంలో దేవస్థానం సిబ్బంది పాల్గొన్నారు.

'సామాజికవర్గం'పై దూషణ సరికాదు..

ప్రజాశక్తి - అద్దంకి

ఇరువురు ఫోనులో మాట్లాడుకునే సమయంలో కమ్మ సామాజిక వర్గాన్ని దూషించినట్లు మాట్లాడటం సబబు కాదని తెలుగుదేశం నాయకులు అన్నారు. నర్రావానిపాలెం కళ్యాణ మండపంలో కమ్మ సామాజిక వర్గానికి చెందిన నాయకులు సమావేశం అయ్యారు. వారం క్రితం జనసేనకు చెందిన యువకుడు ఒక తెలుగుదేశం నాయకునితో ఫోనులో కమ్మ సామాజిక వర్గంపై మాట్లాడిన మాటల రికార్డు సోషల్ మీడియాలో హల్చల్ చేశాయి. కార్యక్రమంలో టిడిపి నాయకులు కోనేటి అనిల్, వడ్లవల్లి పూర్ణచంద్రరావు, దొప్పలపూడి ప్రసాద్, కార్యకర్తలు పాల్గొన్నారు.

యోగాతో మానసిక వికాసం

జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ

జ్యోతిప్రజ్వలన చేస్తున్న జేసీ గోపాలకృష్ణ

ప్రజాశక్తి-కొత్తపట్నం

కొత్తపట్నం సముద్ర తీరంలో యోగాభ్యాసం ఆదివారం ఉదయం ఆహ్లాదకరమైన వాతావరణంలో జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ జ్యోతిప్రజ్వలన చేసి.. ప్రారంభించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్యాంధ్ర సాకారం దిశగా వడివడిగా అడుగులేస్తూ ఆరోగ్య భద్రతకు చర్యలు తీసుకుంటోందన్నారు. పట్టణ ప్రాంతాల్లో కూడా యోగ రోడ్డును ఏర్పాటు చేసి ప్రతి రోజూ యోగ సాధన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 15వ తేదీ ఆదివారం శింగరాయకొండ మండలం, పాకల బీచ్‌లో ప్రత్యేక యోగాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వివరించారు. 20వ తేదీన సుమారు పది వేల మంది స్వయం సహాయక సంఘాల సభ్యులతో ప్రత్యేక యోగా కార్యక్రమాన్ని జరుపుకోనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో అలరించాయి. కార్యక్రమంలో ఆర్డీవో లక్ష్మీప్రసన్న, డిపిఓ వెంకటనాయుడు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ వెంకటేశ్వరరావు, పశు సంవర్ధక శాఖ డిడి రవికుమార్, బిసి కార్పోరేషన్ ఈడి వెంకటేశ్వర రావు, సెట్వెల్ సీఈఓ శ్రీమన్నారాయణ, తహసీల్దార్ మధుసూదన్ రావు, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

జిజిహెచ్ సూపరింటెండెంట్‌గా మాణిక్యరావు

మెడికల్ కాలేజ్ ప్రిన్సిపల్‌గా అశోక్‌కుమార్ నియామకం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

అనంతపురం ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపల్‌గా పనిచేస్తున్న డాక్టర్ ఎస్.మాణిక్యరావును ఒంగోలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. విజయవాడ ఎస్ఎంసిలో ప్రిన్సిపల్‌గా పనిచేస్తున్న డాక్టర్ పి.అశోక్ కుమార్‌ను ఒంగోలు ప్రభుత్వ వైద్యకళాశాల ప్రిన్సిపల్‌గా నియమించింది. ఒంగోలు ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపల్, జిజిహెచ్ సూపరింటెండెంట్‌గా వ్యవహరిస్తున్న డాక్టర్ ఏ.ఏడుకొండలరావును విజయవాడ ఎస్ఎంసిలో ప్రిన్సిపల్‌గా బదిలీ చేసింది. జిజిహెచ్ సూపరింటెండెంట్‌గా నియమితులైన డాక్టర్ ఎస్.మాణిక్యరావు, ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపల్‌గా నియమితులైన డాక్టర్ పి.అశోక్‌కుమార్ త్వరలో విధులలో చేరనున్నట్లు సమాచారం.

'ఎంసెట్'లో శ్రీప్రతిభ విద్యార్థుల జయకేతనం

బత్తిన స్వాతికి 1071 ర్యాంకు

విద్యార్థులను అభినందిస్తున్న నల్లూరి వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఎపి ఈఏపి సెట్ -2025 ఫలితాలలో శ్రీ ప్రతిభ విద్యా సంస్థల విద్యార్థులు జయకేతనం ఎగురవేశారు. పరీక్షా ఫలితాలలో బత్తిన స్వాతి 1071 ర్యాంకు, కాకర్ల మణి చందు 2807 రాష్ట్ర స్థాయి ర్యాంకులు సాధించి కళాశాల ప్రతిష్టను మరోమారు ఇనుమడింపచేశారు. ర్యాంకులు సాధించిన విద్యార్థులలో బత్తిన స్వాతి 1071 ర్యాంకు, కాకర్ల మణి చందు 2807 ర్యాంకు, పోటు విష్ణు 3376 ర్యాంకు, కుమ్మర వెంకట కళ్యాణ్‌రామ్ 3875 ర్యాంకు, పెయ్యాల వెంకట పవన్ 5602 ర్యాంకు, దొండపాటి స్నేహారెడ్డి 5664 ర్యాంకు, బత్తిన చరణ్ తేజ 5838 ర్యాంకు, ఊడ శ్రీ సాయి చందన 6155 ర్యాంకు, పాలెం గణేష్ రెడ్డి 6716 ర్యాంకు, నాగినేని లక్ష్మీదీపిక 7558 ర్యాంకులు సాధించారు. అత్యుత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థినీ, విద్యార్థులు సహకరించిన అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందిని శ్రీ ప్రతిభా విద్యా సంస్థల ఛైర్మన్ నల్లూరి వెంకటేశ్వర్లు, వైస్ ఛైర్మన్ నల్లూరి సీతారామాంజనేయులు, సిఇఒ నల్లూరి జయప్రకాశ్ నారాయణ్ అభినందనలు తెలియజేశారు.

ఎంసెట్ ఫలితాల్లో 'శ్రీ చైతన్య' సంచలనం

ఇంజినీరింగ్‌లో ఎం.సౌమ్యశ్రీకి 426వ ర్యాంక్

సౌమ్యశ్రీ

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

ఎంసెట్- 2025 ఫలితాలలో ఒంగోలు శ్రీ చైతన్య విద్యార్థులు రాష్ట్ర , జిల్లా స్థాయిలో టాప్ ర్యాంకులను సాధించారు. ఇంజనీరింగ్ విభాగంలో మాడుగుండు సౌమ్య శ్రీ 426వ ర్యాంకును సాధించారు. వి.విజయ వర్ష 2990 ర్యాంకు, జి.సాహితీ 3270 ర్యాంకు, ఎస్‌వి కృష్ణ సాయి 4579 ర్యాంకు అందుకున్నారు. బైపిసి విభాగంలో కె.లలిత విజయ కుమారి చౌదరి 4876 ర్యాంకును సాధించింది. ఐదు వేల లోపు ఐదు ర్యాంకులు, 7 వేల లోపు ర్యాంకులు 19 మంది, 10 వేల లోపు ర్యాంకులు 37 మంది, 30 వేల లోపు 84 మంది సాధించారు. జిల్లా స్థాయి లో శ్రీ చైతన్య అత్యధిక స్థాయిలో ర్యాంకులు సాధించటం పట్ల ఒంగోలు బ్రాంచి డీన్ ఎం.రామకృష్ణ కళాశాల ప్రిన్సిపల్స్ అభినందించారు. ఒంబగోలు శ్రీ చైతన్య సంస్థల కీర్తి ప్రతిష్టలను పెంచిన విద్యార్థినీ, విద్యార్థులు, సహకరించిన అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, తల్లిదండ్రులకు వారు కృతజ్ఞతలు తెలియజేశారు.

నిబద్ధతకు నిదర్శనం డాక్టర్ సీతారామయ్య

- ప్రజావైద్యునిగా విశేష సేవలు
- టిడిపిలో అంచెలంచెలుగా ఎదిగిన సీతారామయ్య
- నేడు పిడిసిసి బ్యాంకు ఛైర్మన్‌గా ప్రమాణస్వీకారం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

డాక్టర్ కామేపల్లి సీతారామయ్య జిల్లా ప్రజలకు పరిచయం అక్కరలేని పేరు. వెంకట రమణ నర్సింగ్‌హోంలో ప్రజా వైద్యునిగా విశేష సేవలు అందించారు. తెలుగుదేశం పార్టీలో అంచెలంచెలుగా ఎదుగుతూ ఏ బాధ్యతలు అప్పగించిన నిబద్ధత, చిత్తశుద్ధితో చేసుకొనిపోవటంలో ఆయన అందె వేసిన చెయ్యి. టిడిపిలో ఆయన సేవలకు గుర్తింపుగా ప్రతిష్టాత్మకమైన ప్రకాశం జిల్లా సహకార కేంద్ర బ్యాంకు(పిడిసిసి) ఛైర్మన్ పదవి ఆయనను అలంకరించింది. సోమవారం పిడిసిసి బ్యాంకు ఛైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేయనున్న డాక్టర్ కామేపల్లి సీతా రామయ్య ప్రస్థానంపై ప్రత్యేక కథనం...

డాక్టర్ కామేపల్లి వెంకటరమణారావు, భారతి దంపతులకు ఇద్దరు కుమారులు, పెద్ద కుమారుడు డాక్టర్ కె.సీతారామయ్య, చిన్న కుమారుడు డాక్టర్ చంద్రశేఖర్. వెంకట రమణారావు ఐదున్నర దశాబ్దాల క్రితం ఒంగోలులో వెంకట రమణ నర్సింగ్ హెూంను స్థాపించి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించారు. మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ ఎన్‌టి రామారావు తెలుగుదేశం పార్టీని స్థాపించటంలో డాక్టర్ వెంకట రమణారావు పార్టీ వ్యవహారాలలో చురుకుగా పాల్గొనేవారు. దీంతో టిడిపి రాష్ట్ర అధ్యక్షులైన ఎన్‌టి రామారావు 1989 ఎన్నికలలో డాక్టర్ కామేపల్లి వెంకట రమణారావుకు ఒంగోలు ఎమ్మెల్యే టిక్కెట్ ఇచ్చారు. ఈ ఎన్నికలలో డాక్టర్ రమణారావు స్వల్ప మెజార్టీ ఓటమి చెందారు. ఆయన ఇద్దరు కుమారులైన డాక్టర్ కామేపల్లి సీతారామయ్య, డాక్టర్ కామేపల్లి చంద్రశేఖర్ వైద్యులుగా స్థిరపడ్డారు. తన తండ్రి రాజకీయ వారసత్వాన్ని డాక్టర్ కె.సీతారామయ్య అందిపుచ్చుకున్నారు.

డాక్టర్ సీతారామయ్య నేపథ్యమిదీ..

1966 జనవరి 7న జన్మించారు. పివిఆర్ బాలుర ఉన్నత పాఠశాలలో పదో తరగతి. సిఎస్ఆర్ శర్మ కళాశాలలో ఇంటర్మీడియట్, బెంగళూరు ఎంఎస్ రామయ్య వైద్య కళాశాలలో ఎంబిబిఎస్ పూర్తి చేశారు. అక్కడే కళాశాలలో డయాబెటాలజీ పూర్తి చేశారు. అనంతరం 1995లో డాక్టర్ రమాదేవిని డాక్టర్ సీతారామయ్య వివాహం చేసుకున్నారు. వారికి సాయి చరిత అనే కుమార్తె ఉంది. ఆమె నెల్లూరు వైద్య కళాశాలలో ఎంబిబిఎస్ చదువుతోంది.

వైద్యంతో పాటు సేవా కార్యక్రమాలు

డాక్టర్ కామేపల్లి సీతారామయ్య ఓ వైపు వైద్యునిగా సేవలందిస్తూ.. మరో వైపు తెలుగుదేశం పార్టీలో క్రియాశీలకంగా వ్యవహరించారు. 2024 ఎన్నికలలో ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావు గెలుపునకు ఎనలేని కృషి చేశారు. కొత్తపట్నం మండలంలో ఇంటింటికి తిరిగి దామచర్ల గెలుపు కోసం నిరంతరం మండల నాయకులు, కార్యకర్తలకు దిశా నిర్ధేశం చేశారు.

సీతారామయ్యను వరించిన పిడిసిసిబి పీఠం

ప్రకాశం జిల్లా సహకార కేంద్ర బ్యాంకు(పిడిసిసి) ఛైర్మన్‌గా డాక్టర్ కె.సీతారామయ్యకు పదవి వచ్చేందుకు ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావు కృషి చేశారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, ఉమ్మడి ప్రకాశం జిల్లా మంత్రులు గొట్టిపాటి రవికుమార్, డిబివి స్వామి, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలను ఒప్పించి డాక్టర్ కె.సీతారామయ్యకు పిడిసిసి బ్యాంకు ఛైర్మన్ పీఠం దక్కేలా ఎమ్మెల్యే దామచర్ల కృషి చేశారు.

నేడు ప్రమాణ స్వీకారం

పిడిసిసి బ్యాంకు ఛైర్మన్‌గా డాక్టర్ కామేపల్లి సీతారామయ్య సోమవారం ప్రమాణ స్వీకారం చేయనున్నారు. కార్యక్రమానికి జిల్లా మంత్రులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు హాజరు కానున్నారు.

ప్రజాపంపిణీ వ్యవస్థ పటిష్టతే లక్ష్యం

- రైస్ కార్డుల్లో మార్పులకు చర్యలు
- 60 కేంద్రాల ద్వారా ధాన్యం సేకరణకు
- జిల్లా పౌర సరఫరాల అధికారి ఎస్.పద్మశ్రీ వెల్లడి

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

జిల్లాలో ప్రజాపంపిణీ వ్యవస్థ పటిష్టతే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు జిల్లా పౌర సరఫరాల అధికారి ఎస్.పద్మశ్రీ తెలిపారు. దీపం-2 పథకంలో లబ్ధిదారులకు గ్యాస్ సిలిండర్లు పంపిణీ చేయటంతో పాటు ప్రభుత్వం ద్వారా వచ్చే నగదును వారి ఖాతాలకు జమ చేస్తున్నామన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు రైస్ కార్డులలో మార్పులు, చేర్పులకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. జిల్లా పౌర సరఫరాల శాఖ ద్వారా ప్రజలకు అందిస్తున్న సేవలను డిఎస్ఓ ప్రజాశక్తికి వివరించారు. అవన్నీ ఆమె మాటల్లోనే..

కలెక్టర్ ఏ.తమీమ్అన్సారియా ఆదేశాల మేరకు ప్రజా పంపిణీ వ్యవస్థలో చౌక ధరల దుకాణాల ద్వారా కార్డుదారులు ముఖ్యంగా వృద్ధులు, రోగులు, రోజువారీ కూలీల కోసం ప్రభుత్వం నాణ్యమైన ఫోర్టిఫైడ్ బియ్యం, ఇతర నిత్యవసర సరుకులను కార్డుదారులకు అందజేస్తోంది.

రేషన్ షాపుల్లో సరుకులు పంపిణీ

మొబైల్ డెలివరీ యూనిట్లు(ఎండియు) ప్రభుత్వం రద్దు చేయటంతో చౌకధరల దుకాణాల ద్వారా కార్డుదారులకు సరుకులు పంపిణీ చేస్తున్నామన్నారు. జిల్లాలో 1,392 రేషన్ షాపులు ఉండగా అంత్యోదయ అన్న యోజన (ఏఏవై) కార్డులు 32,064, తెల్ల కార్డులు 6,29,142 మొత్తం 6,61,206 ఉన్నాయి. ఈ కార్డుదారులకు ప్రతి నెలా 10,391 మెట్రిక్ టన్నుల బియ్యం, 346 మెట్రిక్ టన్నుల చక్కెర, 661 మెట్రిక్ టన్నుల కందిపప్పు పంపిణీ జరుగుతోంది. గత నాలుగు నెలలుగా రాష్ట్ర స్థాయిలో కంది పప్పు టెండర్లు ఖరారు కాకపోవటంతో సరఫరా నిలిచిపోయింది. ప్రభుత్వం నుంచి కందిపప్పు వచ్చిన వెంటనే అందజేస్తాం..

దీపం-2 లబ్ధిదారులకు అందజేత

కేంద్రప్రభుత్వం ఉచితంగా దారిద్ర్య రేఖకు దిగువున ఉన్న నిరుపేదలకు ఉజ్వల్/పిఎంయువై కనెక్షన్, గ్యాస్ పొయ్యి ఉచితంగా ఇవ్వటం జరుగుతోంది. ఇప్పటి వరకు 26,969 కనెక్షన్లు జిల్లాలో ఇచ్చారు. 41,061 సిఎస్ఆర్ కనెక్షన్లు, 1,77,084 దీపం కనెక్షన్లు ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా దీపం-2 పథకం ద్వారా 2024 నవంబర్ 1 నుంచి అర్హత కలిగిన లబ్దిదారులకు సంవత్సరానికి 3 ఉచిత గ్యాస్ సిలిండర్లు అందిస్తోంది. జిల్లాలోని మొత్తం 19 గ్యాస్ ఏజెన్సీల ద్వారా అందజేస్తున్నాం. మొదటి విడతలో 3,92,582 మంది లబ్ధిదారులకు రూ.31,82,74,770/-సబ్సిడీ లబ్ధిదారుల బ్యాంకు ఖాతాకు జమ చేశాం. రెండో విడతలో ఇప్పటివరకు 40,037 మంది లబ్ధిదారులకు రూ.3,25,56,616/- సబ్సిడీ లబ్ధిదారుల బ్యాంకు ఖాతాకు జమ చేశాం.

60 కేంద్రాల ద్వారా ధాన్యం సేకరణ

ఖరీఫ్ మార్కెటింగ్ సీజన్‌కు సంబందించి 1319 మంది రైతుల నుంచి 10 మండలాల్లోని 45 ఆర్ఎస్‌కె కేంద్రాల ద్వారా 12,773 మెట్రిక్ టన్ను ధాన్యాన్ని సేకరించాం. ఇందుకు గానూ రూ.20.45 కోట్లు రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేశాం. రబీ మార్కెటింగ్ సీజన్‌కు సంబంధించి 550 మంది రైతుల నుంచి 8 మండలాల్లోని 15 ఆర్ఎస్‌కె కేంద్రాల ద్వారా 4147 ధాన్యాన్ని సేకరించాం. రూ.9.56 కోట్లకు గానూ రూ.7.47 కోట్లను రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేశాం.

రైస్ కార్డుల మార్పులకు చర్యలు

రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు జిల్లాలో మే నెం 7వ తేదీ నుంచి గ్రామ/ వార్డు సచివాలయాలలో రైస్ కార్డుల మార్పులకు చర్యలు చేపట్టాం. కొత్త రైస్ కార్డు, బియ్యం కార్డును విభజించడం, రైస్ కార్డులో సభ్యులను చేర్చడం, రైస్ కార్డులో సభ్యులను తొలగించడం, రైస్ కార్డుని అప్పగించటం,. రైస్ కార్డులో ఆధార్ సరిచేయటం, రైస్ కార్డులో చిరునామా మార్పు వంటి 7 రకాల సేవలను అందిస్తున్నాం. జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరుతున్నా..